చదవండి.. చదివించండి..
నేటి శుభోదయ
ప్రతిక్షణం.. ప్రజల కోసం...
నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక
నిష్పక్ష వార్తలు | నిజాయితీ జర్నలిజం | ప్రజల గొంతుక
వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి
మా వెబ్‌సైట్ www.netishubhodaya.com
వాట్సాప్ 96965 71571
మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!

RNI TELTEL/2024/89620
తెలంగాణ
నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA
Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 333 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శుక్రవారం 11 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

## ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

- కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- అసెంబ్లీ కార్యకలాపాలను బీఆర్ఎస్ అడ్డుకుంటోందని ఆరోపణ
- అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ అహంకారం వీడలేదని వ్యాఖ్య
- ప్రతిపక్షాల కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలని ఎమ్మెల్యేలకు పిలుపు
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు....

▸▸2



# ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు..

## సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ




- ఈ వారాంతంలో ఢిల్లీ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు
- సర్వం సిద్ధం అంటూ ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్
- హాజరుకానున్న రష్యా, చైనా అధ్యక్షులు పుతిన్, జిన్‌పింగ్
- రాజధానిలో 15,000 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత
- భారత్‌కు ఇది నాలుగోసారి అధ్యక్ష బాధ్యత

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** ఈ వారాంతంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని, ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. .....

2

# అనుముల సోదరులకు 1250 కోట్లు ఇవ్వడమేనా ప్రజాపాలన..? - కేటీఆర్



- రేవంత్ రెడ్డి సొంత సోదరులకే తెలంగాణను దోచిపెడుతున్నారు: కేటీఆర్
- ఫోర్త్ సిటీలో రూ. 200 కోట్ల విలువైన భూమి తమ్ముడి కంపెనీకి ధారాదత్తం
- ప్రశ్నిస్తే సస్పెండ్ చేస్తారా..

కాంగ్రెస్ అవినీతిని ప్రజాక్షేత్రంలోనే తేలుస్తాం!

2

**నేటి శుభోదయ, ఫోర్త్ సిటీ :** అమెరికా పర్యటనలో సొంత సోదరులతోనే ఒప్పందాలు చేసుకొని రేవంత్ రెడ్డి తెలంగాణకు పెట్టుబడులు తెస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి కంపెనీ టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు రూ.200 కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7 కోట్లకు కట్టబెట్టింది. ఫోర్త్ సిటీలో అక్రమంగా కట్టబెట్టిన భూమిని హరీశ్ రావు, బీఆర్ఎస ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..ది గ్రేట్ అనుముల రేవంత్ రెడ్డితో ది గ్రేట్ పారిశ్రామికవేత్త అనుముల జగదీశ్వర్ రెడ్డితో రూ.1000 కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాడు. ఇలా అనుముల జగదీశ్వర్ రెడ్డికి రూ.1000 కోట్లు, అనుముల కొండల్ రెడ్డికి రూ.250 కోట్లు ఇవ్వడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. అనుముల అన్నదమ్ముల దోపిడీ గురించి బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారిందని బీజేపీ వాళ్ళు అంటారు.. మరి దొంగని పట్టుకోవాల్సిన కేంద్ర హోమ్ మంత్రి ఎక్కడ ఉన్నాడని సూటిగా ప్రశ్నించారు. ఇజ్రాయెల్ తో ఒప్పందం చేసుకుంటే రాహుల్ గాంధీ మోడీని ప్రశ్నించాడు.. అదే రేవంత్ రెడ్డి ఇజ్రాయెల్ తో ఒప్పందం చేసుకుంటే నువ్వు ఎందుకు ప్రశ్నించడం లేదు, ఎందుకు ఈడీ విచారణకు, సీబీఐ విచారణకు ఆదేశించడం లేదన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డిని చూసి పొంగులేటి కూడా రాఘవ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ అని స్టార్ట్ చేశాడు. ఇలా కాంగ్రెస్ అవినీతి, అక్రమాలను శాసనసభలో ప్రశ్నిస్తారనే భయపడి మమ్మల్ని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారన్నారు. ఇలాంటి వాటికి భయపడమని ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ అవినీతిని ప్రజలకు వివరిస్తామన్నారు.

# పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

## ప్రభుత్వరంగ బ్యాంకుల్లో నిధుల జమకు చాన్స్



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018 సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం ఈ బిల్లును మంత్రి సీతక్క సభలో ప్రవేశపెట్టారు. ఈ చట్టం 70వ సెక్షన్‌లోని సబ్ సెక్షన్-3ని తాజాగా ప్రభుత్వం సవరించింది. కొత్త సవరణ ప్రకారం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని సమీపంలోని ప్రభుత్వరంగ బ్యాంకుల్లో జమ చేసుకునేలా చట్ట సవరణ చేశారు. ప్రస్తుతం సొంత ఆదాయాన్ని ట్రెజరీల్లోనే జమ చేస్తున్నారు. దీంతో గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా డ్రా చేసుకోవాల్సి వస్తున్నది.

# సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా? - కేటీఆర్

- విద్యుత్ రంగాన్ని కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందన్న కేటీఆర్
- పాతకాలపు కరెంట్ కోతలు పునరావృతమవుతున్నాయని విమర్శ
- రేవంత్ సొంత గ్రామంలోనే రైతులు విద్యుత్ కోతలతో అల్లాడుతున్నారన్న కేటీఆర్



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని... కేసీఆర్ హయాంలో లభించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో మళ్లీ పాతకాలపు కరెంటు కోతలు పునరావృతమవుతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు తమ కష్టాలను వెళ్లబోసుకుంటున్న వీడియోను సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పంచుకుంటూ ప్రభుత్వంపై .....

▸▸2

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది : భట్టి విక్రమార్క

- రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్న భట్టి
- ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల కోసం శ్రీశైలం, సాగర్ తదితర రిజర్వాయర్లను పరిశీలిస్తున్నామని వెల్లడి
- విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందన్న డిప్యూటీ సీఎం

2



# రేవంత్ రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం - హరీశ్‌రావు

- కాంగ్రెస్ పార్టీ ఫేక్ సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా దాడి చేస్తోందన్న హరీశ్
- ఫేక్ అకౌంట్లలోని పోస్టులను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారని మండిపాటు
- సభకు, ప్రజలకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

2



## బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి..

### ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

**మొదటిపేజీ తరువాయి..** స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

## సాక్షాత్తు సీఎం సొంత ఊరిలోనే ఈ దుస్థితా? - కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి..**
వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?" అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరిపడా వోల్టేజ్, సమయానికి కరెంటు రాకపోవడంతో పొలాలకు నీళ్లు పారక పంటలు ఎండిపోతున్నాయని, విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని అన్నారు.

## అదుపుతప్పి పెట్రోల్ బంక్‌ను ఢీకొట్టిన బస్సు.. తప్పిన పెను ప్రమాదం



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** హైదరాబాద్ శివార్లలో టీజీఎస్ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. అదుపుతప్పిన బస్సు వేగంగా ఓ పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లడంతో అక్కడున్న వాహనాలు, యంత్ర పరికరాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. ఈ ప్రమాదం నుంచి సిబ్బంది, ప్రయాణికులు అదృష్టవశాత్తు ప్రాణాలతో బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాటసింగారం వద్ద గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. దిల్‌సుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి చౌటుప్పల్ వైపు వెళుతుండగా, మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఒక ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి డ్రైవర్ బస్సును పక్కకు మళ్లించాడు. అయితే, బస్సు అధిక వేగంతో ఉండటంతో నియంత్రణ కోల్పోయి రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బంక్‌లో ఆగి ఉన్న ఒక కారు పూర్తిగా ధ్వంసం కాగా, మరో వాహనం పాక్షికంగా దెబ్బతింది. బస్సు నేరుగా డీజిల్ ఫిల్లింగ్ పాయింట్‌ను ఢీకొట్టడంతో అక్కడి యంత్ర పరికరాలు ఛిన్నాభిన్నమయ్యాయి. ఓ పెట్రోల్ పంప్ ఎగిరిపడింది. ఒక్కసారిగా బస్సు దూసుకురావడంతో పెట్రోల్ బంక్ సిబ్బంది, వాహనదారులు భయాందోళనలతో పరుగులు తీశారు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలన్నీ అక్కడ ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి.

## ఏకంగా సెక్రటేరియట్‌లోనే లంచం.. ఏసీబీ చేతికి చిక్కిన ఉద్యోగి



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ సచివాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సెక్షన్‌లో పని చేస్తున్న డేటా ఎంట్రీ ఆపరేటర్ లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు ఇచ్చేందుకు బాధితుడి నుంచి రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సీఎంఆర్ఎఫ్ చెక్కు కోసం లంచం అడగడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో అధికారులు పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగారు. గురువారం సచివాలయ ప్రాంగణంలో నిఘా ఏర్పాటు చేశారు. సచివాలయంలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ.లక్ష లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత సీఎంఆర్ఎఫ్ సెక్షన్‌లోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక మరికొందరి పాత్ర ఉందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో రెగ్యులర్ అధికారుల ప్రమేయం ఉందా? అన్నదీ ఏసీబీ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు.. సర్వం సిద్ధమన్న ప్రధాని మోదీ




**మొదటిపేజీ తరువాయి..** 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు. సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు. భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి సారించింది : భట్టి విక్రమార్క

**మొదటిపేజీ తరువాయి..** తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్ల' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/ సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

## వంత్ రెడ్డిపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం : హరీశ్‌రావు

**మొదటిపేజీ తరువాయి..** కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

## 22ఏ భూములపై చర్చకు డిమాండ్..

### మండలిలో రసాభాస.. బీఆర్ఎస్ వాకౌట్

**నేటి శుభోదయ, హైదరాబాద్ :**
తెలంగాణ శాసనమండలిలో 22ఏ నిషేధిత భూముల వివాదంపై ఈరోజు తీవ్ర గందరగోళం నెలకొంది. సభ ప్రారంభమైన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా ల్యాండ్ రికార్డులు, 22ఏ భూములకు సంబంధించిన సమస్యలపై తక్షణమే పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు వాయిదా తీర్మానాన్ని ప్రతిపాదించారు. అయితే మండలి చైర్మన్ ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తూ, ముందస్తు ఎజెండా ప్రకారం ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్మన్ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ సభ్యులు పోడియం వైపు దూసుకెళ్లి నినాదాలు చేయడంతో సభలో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో సభను సజావుగా సాగనివ్వాలని, ప్రజా సమస్యలపై చర్చించేందుకు సభ్యులు తమ స్థానాల్లో కూర్చుని సహకరించాలని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేసినప్పటికీ బీఆర్ఎస్ నేతలు శాంతించలేదు. ప్రభుత్వం



చర్చకు భయపడుతోందని ఆరోపిస్తూ సభ జరుగుతున్న తీరుకు నిరసనగా బీఆర్ఎస్ సభ్యులందరూ మండలి నుంచి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వాకౌట్ అనంతరం మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడుతూ... శాసనమండలి ప్రాంగణంలో ప్రతిపక్ష సభ్యుల పట్ల మార్షల్స్ ప్రవర్తించిన తీరును తప్పుబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న ప్రజాప్రతినిధుల హక్కులను భంగపరిచేలా మార్షల్స్ వ్యవహరించడం శోచనీయమని ఆయన మండిపడ్డారు.

## ధర్పల్లిలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు

**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను నాయకులు, రజక సంఘ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ ముక్తి కోసం దొరలు, నైజాం భూస్వాములకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళా చైతన్యానికి, హక్కుల పోరాటానికి ఆమె నిలువెత్తు నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎజ్జా శ్రీకాంత్, నాయకులు సుభాష్‌తో పాటు రజక సంఘ నాయకులు, కుల సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు.



## సిరికొండలో దళిత జేఏసీ నాయకులనిరసన ర్యాలీ

- **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై వ్యాఖ్యలను ఖండించిన నాయకులు**

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై శాసనమండలి సభ్యుడు తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం సిరికొండ మండల కేంద్రంలో దళిత జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుండి తెలంగాణ చౌరస్తా వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చి తమ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా దళిత జేఏసీ నాయకులు నక్క రాజేందర్, రావూట్ల రమేష్, నక్క రాజేశ్వర్మొట్టల రాము,చిట్యాల రవి శంకర్ లు మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌పై చిత్తశుద్ధి లేని వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించదగినదన్నారు. వ్యాఖ్యలు చేసిన బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.డప్పులతో కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి పిలుపులో భాగంగా అక్కడికి వెళ్లిన దళిత సోదరులు తిరిగి వెళ్లిన అనంతరం... "దళితులు రావడం వల్ల ఈ ప్రాంతం మైలపడిందంటూ" పసుపు నీళ్లు చల్లి దళిత సమాజాన్ని అవమానించారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు లేకుండా మీరు బ్రతకలేరనే విషయాన్ని మరచి పోయారా అంటూ దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించి, పసుపు నీళ్లు చల్లిన బాధ్యులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు పట్టుబట్టారు. సమాజంలో ఇంకా ఇలాంటి వివక్షాపూరిత చర్యలకు పాల్పడటం సరికాదని, బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని దళిత జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- **తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అసలైన వారసులు కమ్యూనిస్టులే**
- **సిపిఎం యాచారం మండల కార్యదర్శి అల్లంపల్లి నరసింహ**

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ 41వర్ధంతి మరియు వారోత్సవాలు ఈరోజు యాచారం మండల కేంద్రంలో సిపిఎం యాచారం మండల కమిటీ అధ్వర్యంలో జరిగయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ్మా గారు హాజరై కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ గారి విగ్రహానికి పూల మాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు అనంతరం ఆలంపల్లి నరసింహ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో వారికి గులాములుగా జమీందార్లు,జాగీర్దార్లు,దేశ్‌ముఖ్‌లలో జెన్నరెడ్డి ప్రతాపరెడ్డి,విసునూర్ రామచంద్రారెడ్డి, లాంటి దుర్మార్గులు ఉన్నారని ఇలాంటి ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి,వెట్టిచాకిరి విముక్తి కోసం పుచ్చలపల్లి సుందరయ్య గారి నాయకత్వంలో రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి కమలా దేవి, భీమి రెడ్డి నర్సింహ్మా రెడ్డి,తోలి అమరుడు దొడ్డి కొమరయ్య, వీరనారి చిట్యాల ఐలమ్మ,కాచం క్రిష్ణ మూర్తి, (రాగన్న), ముస్లింలైనా షేక్ బందాగి ముఖ్దుం మొహియుద్దీన్,షోయబుల్లా ఖాన్, అల్లం కుందిమీరి లాంటి మహనీయులు మరెందరో చేసిన పోరాటం ద్వారా చైతన్యం పొందిన మట్టి మనుషులు తిరుగుబాటుతో ధిక్కార స్వరాలై "బాంచన్ దొర కాల్మొక్త" అన్న వెట్టి మనుషులు చేత "దొర ఏందిరో నీ దొర పికుడేందిరో" అంటూ బందూకులు పట్టించిన. కమ్యూనిస్టులు నడిపిన పోరాట మదిని కొనియాడారు.4వేల మంది వీర మరణం పొందారన్నారు. అ పోరాటమే ఫలితమే 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని 3 వేలకు పైగా గ్రామ స్వరాజ్యాలు ఎర్పాటు చేసిన చరిత్రాత్మకమైన పోరాటమన్నారు. కానీ కులం పేర మతం పేర,ప్రాంతం పేరుతో జరిగిన పోరాటం కాదని కానీ ఆ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని కాషాయ మూకలు హిందూ, ముస్లిం పేరుతో మతం రంగు పులిమి బిజెపి రాజకీయ పబ్బం గడుపుకోవాడాని హిందూ ముస్లింలపై మధ్యన చిచ్చు పెట్టుతుందన్నారు. నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రికరిస్తున్నారనివిమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో అబద్ధాలతో కమ్యూనిస్టుల పోరాట చరిత్రను తూడిపేయాలని "రజాఖార్ ఫైల్స్" లాంటి సినిమాలు తీసి సమాజంలోని నేటి యువతి యువకులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కానీ తెలంగాణ రాష్ట్ర ప్రజలు పోరాట చైతన్యం కలిగిన వారని బిజెపి మత రాజకీయాలు ఈ గడ్డపై సాగ నివ్వరని హెచ్చరించారు. భూమికోసం, భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన అ పోరాట వారసత్వాన్ని స్పూర్తితో ప్రజ సమస్యలపై సిపిఎం పని చేస్తుందని భవిష్యత్తులో యాచారం మండలంలో చాలా సమస్యలు ఉన్నాయని స్థానిక సమస్యలపై ఆందోళన పోరాటాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ చందు నాయక్ మంతన్ గౌరెల్లి గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మి కిషన్, మండల కమిటీ సభ్యులు పి వెంకటయ్య, కే తావు నాయక్ నాయక్, ఉడతల జంగయ్య, విప్లవ కుమార్, భూషణ్, శ్రీకాంత్, కుంటుర గిరి కాంత్ ,ఆర్ కృష్ణ, రమేష్, మహేష్ ,ఉస్మాన్ ,శ్రీనాథ్ పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బొల్లి కన్మణి పుట్టినరోజు వేడుకలు వృద్ధాశ్రమంలో అన్నదానం, పాఠశాలలో విద్యా సామగ్రి పంపిణీ

**తలకొండపల్లి, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన బొల్లి రమేష్ కూతురు బొల్లి కన్మణి ద్వితీయ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం కల్వకుర్తి పట్టణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఓల్డ్ ఏజ్ హోమ్ (వృద్ధాశ్రమం) నిరుపేద వృద్ధులకు 50 కిలోల బియ్యం, పండ్లను పంపిణీ చేశారు. వృద్ధుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంజనేయులు సార్‌తో పాటు వృద్ధాశ్రమ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కేవలం వృద్ధాశ్రమమే కాకుండా,విద్యానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా సహాయం అందించారు.కన్మణి పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పలకలు (స్లేట్స్), టేబుల్ బుక్స్, మరియు విద్యా చార్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కవిత , ఉపాధ్యాయ బృందం మరియు పాఠశాల సిబ్బంది పాల్గొని కన్మణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.పుట్టినరోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వారు కొనియాడారు.





## భూ నక్ష సర్వే ప్రారంభం.. ఏళ్ల నాటి రైతుల సమస్యకు పరిష్కారం

**కేశంపేట, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** కేశంపేట మండలం చింత కుంట ప ల్లి గ్రామంలో ఏళ్లుగా కొనసాగుతున్న భూ నక్ష సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభిస్తోంది. గ్రామంలోని వ్యవసాయ భూములకు నక్ష లేకపోవడంతో రైతులు భూముల హద్దులు, లావాదేవీల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఎన్నికల ముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తులు సమస్యను వివరించగా, వెంటనే స్పందించి నక్ష సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గురువారం గ్రామంలో భూ నక్ష ఏర్పాటు కోసం సర్వే ప్రారంభమైంది. గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనేమోని మల్లేష్ యాదవ్‌తో కలిసి రైతులు, గ్రామస్తులు సర్వేను పరిశీలించారు. భూములకు నక్ష ఏర్పాటు పూర్తయితే భూ తగాదాలు తగ్గడంతో పాటు రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, కొండల్ రెడ్డి, మహేందర్, అనేమోని కుమార్, అంజయ్య యాదవ్, హనుమంతు యాదవ్, ఆర్. నరసింహ తదితర రైతులు పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలపై నిగా పెట్టిన ఎస్సై రాజమౌళి.



**ఇల్లందు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ** టేకులపల్లి మండలం బోడు ఎస్సై రాజమౌళి ఆకస్మిత తనిఖీలు చేపట్టారు. గంజాయి పై ప్రత్యేక దృష్టి పెడతామని హెచ్చరించారు. అనుమానాస్పద వాహనాలను. తనిఖీ చేశారు వాహనాలకు సరైన పత్రాలు ఉండాలని లేనియెడల వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే మాకు సమాచారం అందించాలని తెలిపారు .మాదకద్రవ్యాలు అమ్మిన గాని సేవించిన గాని వారిపై కఠిన చర్యలు తప్పదు అంటూ హెచ్చరించారు గ్రామీణ ప్రాంతంలో గంజాయి తాగిన అమ్మిన గాని వారిపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం అన్నారు.

# విశ్వబ్రాహ్మణ జర్నలిస్టులంతా ఏకతాటిపైకి రావాలి

- **ఐక్యతతోనే జర్నలిస్టుల సంక్షేమం, విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం**
- **సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తూములూరి సత్యనారాయణ**

**వరంగల్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
రాష్ట్రవ్యాప్తంగా ముద్రిత, ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో పనిచేస్తున్న విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల ఐక్యత, సమైక్యతను చాటేందుకే తెలంగాణ విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తూములూరి సత్యనారాయణ తెలిపారు.వరంగల్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ధ్యాన మందిరంలో వరంగల్, హనుమకొండ జిల్లాల విశ్వబ్రాహ్మణ జర్నలిస్టుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు జిల్లాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తూములూరి సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విశ్వ బ్రాహ్మణ జర్నలిస్టులందరూ సంఘంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఐక్యతతో పాటు వారి సంక్షేమం, హక్కుల పరిరక్షణకు సంఘం కృషి చేస్తుందని తెలిపారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కమిటీలను ఏర్పాటు చేసి, భారీ స్థాయిలో రాష్ట్ర మహాసభ నిర్వహిస్తామని వెల్లడించారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి, ఐజేయూ జిల్లా కోశాధికారి డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్ మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీలు జర్నలిస్టుల సంక్షేమానికి, విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యులంతా సమన్వయంతో పనిచేయాలని కోరారు.

**నూతన జిల్లా కమిటీల ఎన్నిక**
రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాల నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వరంగల్ జిల్లా కమిటీ: అధ్యక్షుడిగా కుంటమల్ల అరవింద్, ప్రధాన కార్యదర్శిగా మునిగంటి అమరేందర్, ఉపాధ్యక్షుడిగా అకోజు సాంబయ్య, కోశాధికారిగా రాంపెల్లి శ్రీనివాస చారి ఎన్నికయ్యారు.హనుమకొండ జిల్లా కమిటీ: అధ్యక్షుడిగా ఉల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా దెంచనాల రాజు, కోశాధికారిగా పొడిశెట్టి రమేష్ ఎన్నికయ్యారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో డాక్టర్ పొడిశెట్టి విష్ణువర్ధన్ ప్రమాణ స్వీకారం చేయించారు.నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి ఓదెల సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కలకోటి వీరభద్రయ్య చారి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మండలోజు కృష్ణ ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వడ్ల ప్రవీణ్ చారి, రాష్ట్ర కమిటీ సభ్యులు సర్వేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మారేడోజు సదానందాచారి, ప్రధాన కార్యదర్శి జి. పెంటయ్య చారి, సుగ్రీవ చారి, బ్రహ్మ చారి, శ్రీనివాస్, కిరణ్, మహేష్, శ్రవణ్, పూర్ణచందర్, గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన జెడి



**ఏన్కూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
ఏన్కూరు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ,కళాశాలను పాఠశాల విద్యాశాఖ జేడీ మదన్మోహన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పి యం శ్రీ పథకం పని తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, ఫిజిక్స్ వాలా, ఖానా అకాడమీ, ఎన్రోల్మెంటును పరిశీలించారు. గత ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాలను ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిసి మాధవరావు, ఎఫ్ ఏ ఓ శాంసన్, పాఠశాల ప్రిన్సిపాల్ వేము రాజు, ఏటీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# శ్రావణ ప్రదోష వేళ ఘనంగా కోటి పార్థివలింగార్చన



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి ఆధ్యాత్మిక ధార్మిక సంస్థ ఆధ్వర్యంలోని వాసవి వనిత క్లబ్ ఎల్లారెడ్డిగూడ విభాగం అధ్యక్షురాలు అనిత సహకారంతో స్థానిక శ్రీ విజయదుర్గ మాత పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో కోటి పార్థివలింగార్చన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా భక్తులు శాస్త్రోక్తంగా దీపారాధన, కలశస్థాపన, గణపతి, గౌరీ, నవగ్రహ పూజలు నిర్వహించారు. అనంతరం పుట్టమన్నుతో 108 పార్థివ లింగాలను స్వయంగా తయారు చేసి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, భస్మార్చన, పుష్పార్చన, బిల్వార్చనలతో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా బాసర అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ మాట్లాడుతూ బాసర క్షేత్రంలోని ద్వాదశ జ్యోతిర్లింగ దేవాలయం ఈశాన్య భాగంలో కోటి పార్థివలింగ స్తూపాన్ని నిర్మించినట్లు తెలిపారు. భక్తులు తయారు చేసిన పార్థివ లింగాలను ఆ స్తూపంలో నిక్షిప్తం చేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల మహిళా బృందాలకు ఉచితంగా పుట్టమన్ను అందించి పూజాదికాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.వాసవి వనిత క్లబ్ ఎల్లారెడ్డిగూడ అధ్యక్షురాలు అనిత మాట్లాడుతూ శ్రావణమాస ప్రదోష వేళ సామూహిక శివార్చనలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని బంధువులు, మిత్రులు, వివిధ ప్రాంతాల వాసవి వనిత క్లబ్ సభ్యులకు తెలియజేసి మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమం అనంతరం శివశ్రీ నిర్మల అంబికానాథ శర్మ అనితను అభినందించి దేవాలయ ఛాయాచిత్రం, శేషవస్త్రాన్ని అందజేశారు. దేవాలయ చైర్మన్ లక్ష్మీయాదవ్, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గట్టు ఇప్పలపల్లి లో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి



**తలకొండపల్లి, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలోని రజక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.రజక సంఘం అధ్యక్షుడు దశరథం, ఉపాధ్యక్షుడు స్థాయిలు, సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.దొరల పెత్తందారీకి ఎదురొడ్డి..చాకలి ఐలమ్మ తెలంగాణ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన వీరవనితగా చరిత్రలో నిలిచారు.వరంగల్ ప్రాంతానికి చెందిన ఐలమ్మ విస్నూర్ దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా తన భూమి కోసం ధైర్యంగా పోరాడారు.ఆమె పోరాటం నాటి అణచివేతకు వ్యతిరేకంగా రైతులు, కూలీలు, పేద ప్రజల్లో స్ఫూర్తిని నింపింది. నిజాం పాలన, భూస్వామ్య పెత్తందారీకి వ్యతిరేకంగా ఆమె పోరాటం తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమానికి బలమైన స్ఫూర్తిగా నిలిచింది. ఆంధ్ర మహాసభతో పాటు కమ్యూనిస్టు ఉద్యమంలోనూ ఆమె చురుకుగా పనిచేశారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మహిళలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. 1985 సెప్టెంబర్ 10న ఐలమ్మ మరణించారు; ఆమె వర్ధంతిని ఏటా స్మరించుకుంటున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జినుకుంట్ల చంద్రశేఖర్, ఉప సర్పంచ్ దేరంగుల అనిత విజయ్, వార్డు సభ్యులు రేణు రెడ్డి, శెట్టి రాజశేఖర్, ముకురాల అశోక్ గౌడ్, కొండమోని రాజశేఖర్, ఎంగి వెంకటమ్మ రాజు, గ్రామ నాయకులు మట్ట అంజయ్య, జంగయ్య, పవన్ వాల్మీకి, జగన్, నరేందర్ గౌడ్, శివ గౌడ్, దేశముని రాములు, శ్రీను, ఊరుకొండ రామచంద్రి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రధన అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు వినతి

- **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేసిన సర్పంచ్, సొల్లు రంగమ్మ,పాలకవర్గం**



**తలకొండపల్లి, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
తలకొండపల్లి మండలం చంద్రధన గ్రామ సమగ్ర అభివృద్ధికి అవసరమైన పలు మౌలిక వసతుల పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ సొల్లు రంగమ్మ తనయుడు సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామ పాలకవర్గం సభ్యులు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా గ్రామంలోని అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణం,అండర్‌డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, నల్లచెరువు వద్ద కల్వర్టు/బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. రోడ్ల నిర్మాణంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తొలగుతాయని, అండర్‌డ్రైనేజీతో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వివరించారు.అలాగే నల్లచెరువు వద్ద కల్వర్టు నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో నీటి ప్రవాహం కారణంగా ఏర్పడే రవాణా ఇబ్బందులు తొలగడంతో పాటు గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను ప్రాధాన్యతగా తీసుకుని ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేలా సహకరించాలని సర్పంచ్ రంగమ్మ ఎమ్మెల్యేను కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎన్నెడ్ల రవీందర్‌రెడ్డి, వార్డు సభ్యులు బేగరి ఆలివేలు చెన్నయ్య, ముసిలి పార్వతమ్మ వెంకటయ్య, ఓర్సు రాజు (అంకుశం), ఈటమోని అజయ్ యాదవ్, ఓర్సు బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం ఆధ్వర్యంలో -వీరనారిచాకలి ఐలమ్మ వర్ధంతి

- **చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం పనిచేయాలి**
- **50 ఏండ్లుదాటిన రజక కార్మికులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయాలి**
- **రజక సంఘం రాష్ట్ర నాయకుడు అవుతాపురం శ్రీరాములు**
- **మంచాల మండలం అధ్యక్షుడు లొంగరి మల్లేష్**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
మంచాల మండలం తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మంచాల మండల కేంద్రంలో మంచాల మండలం రజక సంఘం అధ్యక్షుడు లొంగరి మల్లేష్ ఆధ్వర్యంలో మంచాల చెరువు కట్టపైన ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు.ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గ్రామసర్పంచ్ ఏర్పుల మానస వినయ్ కాంగ్రెస్ పార్టీ మండలం అధ్యక్షుడు ఎడ్మనరేందర్ రెడ్డి ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ రజాకారులతో ఎ న్నో పోరాటాలు చేసి ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగిన అక్కడ ప్రజలకు అండగా ఉంటూ పోరాటం చేసిన గొప్ప వీరనారి చాకలి ఐలమ్మ అని అన్నారు.ఆనాడు దొరలతో పోరాటం చేసి దొరలను ఎదిరించి వందలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని పేద ప్రజలకు భూము లు పంచిన గొప్ప తెలంగాణ సాయుధ పోరాట వినరాని చాకలి ఐలమ్మ అని అన్నారు చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలు మర్చిపోలేనివి అని అన్నారు ప్రతిఒక్కరు చాకలి ఐలమ్మ ఆశయ సాధన కోసం కృషి చేయాలి అన్నారు.ఈ సందర్భంగా రజక సంఘం నాయకులు మాట్లాడుతూ గీత కార్మికులకు బీడీ కార్మికులకు ప్రభుత్వం ఎలాగైతే 50 ఏండ్లు దాటిన కార్మికులకు పింఛన్లు ఇస్తుందో 50 ఏండ్లు దాటిన రజక కార్మికులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయాలని మీడియా ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాంఅనిఅన్నారు.ఈకార్యక్రమంలోమంచాల మండల రజక సంఘం అధ్యక్షులు లొంగరి మల్లేష్ మండల ఉపాధ్యక్షులు మొగిలి శ్రీశైలం మంచాల రజక సంఘం గౌరవ సభ్యులు చిల్లపురం గాలయ్య అన్నారం బుగ్గరాములు రజక సంఘం రాష్ట్ర నాయ కులు అవతాపురం శ్రీరాములు జిల్లా కమిటీ సభ్యులు మొగిలి బాలరాజ్ మంచాల గ్రామశాఖ అధ్యక్షులు వడ్లకొండ యాదయ్య చిత్తపురం గ్రామశాఖ అధ్యక్షులు నాంపల్లి శీను తాళ్లగూడెం గ్రామశాఖ అధ్యక్షులు బాలరాజ్ మంచాల మండల రజక సంఘం కార్యదర్శి కొత్తపెల్లి వెంకటే ష్ ఆరుట్ల గ్రామశాఖ బోయపల్లి జంగయ్య వివిధ రాజకీయ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎడ్మ నరేందర్ రెడ్డి ప్రజాసంఘాల నాయకుడు కంబాలపల్లి భాస్కర్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ వైయస్సార్ యువసేన మండలం నాయకుడు లొంగరి యాదగిరి మంచాల గ్రామ సర్పంచ్ మానస వినయ్ ఉపసర్పంచ్ ఓరిగంటి లింగంగౌడ్ సిపిఎం పార్టీ మండలఅధ్యక్షులు రావుల జంగయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రేమాకర్ రెడ్డి మండలం రజక సంఘంసభ్యులు నాంపల్లి రాములు మండల గౌరాధ్యక్షుడు చిల్లపురం స్వామి గ్రామ కార్యదర్శిలు మండల కార్యదర్శిలు రజక సంఘం నాయకులు పాల్గొనడం జరిగింది.

# రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు

**శామీర్‌పేట్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘మీ సమస్య–మా పరిష్కారం’ కార్యక్రమంలో భాగంగా శామీర్‌పేట్ డివిజన్‌లోని రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన సమస్యలకు స్పందన లభించింది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్. హైమారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి గతంలో సమర్పించిన వినతిపత్రం మేరకు అధికారులు గ్రామంలో పర్యటించి సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ IASకు శామీర్‌పేట్ గ్రామస్తులతో కలిసి హైమారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పోతాయిపల్లి గ్రామంలోని రోడ్లు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందజేశారు.మేడ్చల్ నియోజకవర్గ ప్రజలకు ★ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన



(PMSBY)★ను ఉచితంగా అందించేందుకు తమ సంఘం కృషి చేస్తోందని హైమారెడ్డి తెలిపారు.

# బజారు దీక్షిత 13వ జయంతి మహోత్సవం

- కూతురి జ్ఞాపకార్థం వృద్ధాశ్రమంలో అన్నదానం
- ప్రముఖ సంఘ సేవకులు బజారు బిక్షపతి





**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకుడు, బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బజారు బిక్షపతి కుమార్తె బజారు దీక్షిత గత సంవత్సరం ఇంటి కాంపౌండ్ వాల్ కూలిన ప్రమాదంలో అకాల మరణం చెందారు.చిన్న వయసులోనే ఎంతో చురుకుగా ఉంటూ వివిధ క్రీడల్లో పాల్గొని విజేతగా నిలిచి,అనేక బహుమతులు సాధించిన దీక్షిత అకాల మరణం కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులను, ఆమెను అభిమానించే వారందరినీ తీవ్ర విషాదంలో ముంచింది.దీక్షిత 13వ జయంతిని పురస్కరించుకుని ఆమె జ్ఞాపకార్థం ఇబ్రహీంపట్నం వినోబానగర్‌లోని మాతా పితా సేవా సదనంలో జయంతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా దీక్షిత తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురయ్యారు.తమ కళ్ల ముందే అల్లారుముద్దుగా పెరిగిన తమ కుమార్తెను కోల్పోయిన బాధను ఇప్పటికీ,జీర్ణించుకోలేకపోతున్నామని, ప్రతి క్షణం ఆమె జ్ఞాపకాలు తమను వెంటాడుతున్నాయని వారు కన్నీటి పర్యంతమయ్యారు.దీక్షిత భౌతికంగా తమ మధ్య లేకపోయినా,ఆమె నవ్వులు, చిన్ననాటి జ్ఞాపకాలు, క్రీడల్లో సాధించిన విజయాలు ఎప్పటికీ తమ హృదయాల్లో నిలిచిపోతాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.ఆమె జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆమెను తమ మధ్య ఉన్నట్టుగా భావిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బజారు బిక్షపతి,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ కురుమ,బిఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా నాయకులు చిన్నం రఘుపతి కురుమ,నోముల జంగయ్య,శ్రీనివాస్,నవదీప్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు గణం నర్సింహ కురుమ మాట్లాడుతూ,"చిన్న వయసులోనే వివిధ క్రీడల్లో పాల్గొని విజేతగా నిలిచి ఎన్నో బహుమతులు సాధించిన దీక్షిత ఇలా అకాల మరణం చెందడం అత్యంత బాధాకరం.ఆమె కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని,దీక్షిత ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.దీక్షిత 13వ జయంతి సందర్భంగా ఆమెను స్మరించుకుంటూ సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం" అని అన్నారు.దీక్షిత జ్ఞాపకార్థం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఆమెకు ఘన నివాళులు అర్పించి,ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# శుభకార్యాల్లో వసూళ్లపై ఫిర్యాదులు.. హిజ్రాల పేరుతో వేధింపులు అరికట్టాలి

- వికారాబాద్‌లో బాధితుల ఆవేదన.. పోలీసుల జోక్యానికి డిమాండ్





**వికారాబాద్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** వికారాబాద్: శుభకార్యాలు, నూతన వ్యాపారాల ప్రారంభం సందర్భంగా కొందరు హిజ్రాలు అధిక మొత్తంలో నగదు డిమాండ్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వికారాబాద్ పట్టణంలో వినిపిస్తున్నాయి. తమ స్తోమతకు మించి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడం, ఇవ్వకపోతే అసభ్య పదజాలంతో దూషించడం, బంధువులు, మిత్రుల సమక్షంలో అవమానకరంగా ప్రవర్తించడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో..**

చిన్న వ్యాపారాలు చేసుకుంటూ, అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశాలు లేదా ఇతర శుభకార్యాలు నిర్వహిస్తున్న సమయంలో భారీ మొత్తంలో నగదు డిమాండ్లు రావడంతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని చెబుతున్నారు. ఒకప్పుడు శుభకార్యాలకు హిజ్రాలను గౌరవంగా ఆహ్వానించి అతిథి మర్యాదలు చేయడం సంప్రదాయంగా ఉండేదని, కొందరి ప్రవర్తనతో ఆ గౌరవప్రదమైన సంప్రదాయానికి భంగం కలుగుతోందని పలువురు పేర్కొంటున్నారు.

**మధ్యవర్తుల వ్యవస్థపై ఆరోపణలు**

ఎక్కడ శుభకార్యం జరుగుతుందనే సమాచారం కొందరు మధ్యవర్తుల ద్వారా ముందుగానే చేరుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం కమిషన్ల వ్యవహారం కూడా కొనసాగుతోందని పలువురు చెబుతున్నప్పటికీ, దీనిపై అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. శుభకార్యాల వివరాలు ఎలా సేకరిస్తున్నారనే అంశంపై పోలీసులు విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని ఒత్తిళ్లు?**

హిజ్రాలు శపిస్తే అపశకునం జరుగుతుందనే ప్రజల నమ్మకాన్ని కొందరు ఆసరాగా చేసుకుని డబ్బుల కోసం ఒత్తిడి చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. అడిగినంత మొత్తం ఇవ్వకపోతే బహిరంగంగా రచ్చ చేయడం, అవమానకరంగా ప్రవర్తించడం వంటి ఘటనలు తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు వాపోతున్నారు.

**టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి**

ఇలాంటి ఘటనలకు గురయ్యే బాధితులు వెంటనే పోలీసులను సంప్రదించేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. శుభకార్యాలు, వ్యాపార ప్రారంభాల సమయంలో ఎలాంటి బెదిరింపులు, బలవంతపు వసూళ్లు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పోలీసుల భరోసా కావాలి**

వికారాబాద్ పట్టణంలోనూ ఇలాంటి ఘటనలు పలుమార్లు చోటుచేసుకున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొత్తగా వ్యాపారం ప్రారంభించాలన్నా, ఇంట్లో శుభకార్యం నిర్వహించాలన్నా ఇలాంటి పరిస్థితులపై ఆందోళన చెందాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ప్రజలకు భరోసా కల్పించాలని, బలవంతపు వసూళ్లు లేదా వేధింపులపై ఫిర్యాదులు వస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

- యువత చెరువులు, నాలాల పరిరక్షణకు ముందుకు రావాలి: హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్



**వరంగల్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** పర్యావరణ పరంగానూ మట్టి విగ్రహాలనే ఎంచుకోవాలని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సూచించారు.పర్యావరణ పరిరక్షణను లక్ష్యంగా చేసుకుని మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మల్కం చెరువు సమీపంలోని పార్కు వద్ద గురువారం ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర యువత వ్యవస్థాపక అధ్యక్షుడు ఇమ్మడి సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, మల్కం చెరువు వాకర్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, తెలంగాణ షీప్స్ అండ్ గోట్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్, నిత్యారెడ్డి పాల్గొని విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా సుమారు 500 మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా చెరువులు, నీటి వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.చెరువులు, నాలాలను పరిరక్షించేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రభుత్వానికి సహకరించాలని పిలుపునిచ్చారు. చెరువుల కబ్జాల విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.రాష్ట్ర భవిష్యత్తు నేటి యువత చేతుల్లోనే ఉందని, పర్యావరణ పరిరక్షణపై యువతలో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.కార్యక్రమంలో డాక్టర్ ఎం.కె. రాజేష్, ప్రమోద్ కుమార్, రాజేశం, భాస్కర్ గౌడ్, రాజశేఖర్, మల్కం చెరువు కమిటీ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ఎంపిక



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలోని తిలక్ స్టేడియంలో ఈ నెల 12 నుండి 14 వరకు (శుక్రవారం నుండి ఆదివారం వరకు) జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ (అండర్-15) సాఫ్ట్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు సత్యశోధక్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలుపుటకు సంతోషిస్తున్నాము.ఈ నెల 6న ఆర్మూర్ లో జరిగిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఎంపిక పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనా విద్యార్థులు బి. హర్షిత్, కె. అజయ్, జి. సాయితేజ, డి. శ్రీకాంత్ లను పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య గురువారం పాఠశాలలో జ్ఞాపికలను అందించి అభినందించడమైనది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, నిరంతర సాధన వల్ల నైపుణ్యాలు మెరుగుపడతాయని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీలలో రాణించాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు అనిల్, అనికేత్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు, అశ్వాపురం మండలాల్లో ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్ల ఆకస్మిక తనిఖీలు







**పినపాక, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లాలోని మణుగూరు, అశ్వాపురం మండలాల్లో పలు ప్రైవేట్ డయాగ్నొస్టిక్ సెంటర్లను అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డయాగ్నొస్టిక్ సెంటర్లలో నిర్వహిస్తున్న రికార్డులు, రిజిస్టర్లు, ఇతర సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించారు. అలాగే క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్కు సంబంధించిన అనుమతులు, రిజిస్ట్రేషన్ పత్రాలు నిబంధనల అమలును తనిఖీ చేశారు.తనిఖీలలో గుర్తించిన లోపాలను సంబంధిత నిర్వాహకులకు తెలియజేసి, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోపాలు గుర్తించిన డయాగ్నొస్టిక్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు.తనిఖీలకు సంబంధించిన సమగ్ర నివేదికను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి సమర్పించారు.ఈ తనిఖీల కార్యక్రమంలో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాందాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్



**నిజామాబాద్ , సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు.గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ ను తెరిచారు.ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్ లు,ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు.సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని,ఈవీఎంలు,బ్యాలెట్ యూనిట్లు,ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్,ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్,సిబ్బంది సాత్విక్,విజయేందర్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,అధికారులు ఉన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ పూర్ణ కుటుంబానికి నూతక్కి పరామర్శ

- ధైర్యంగా ఉండండి.. మేమంతా అండగా ఉన్నాం
- సీనియర్ వార్డు సభ్యుడు నూతక్కి సాంబశివరావు



**మహబూబాబాద్ సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ అనుగోజు పూర్ణచందర్‌రావు తండ్రి అనుగోజు కోటయ్య ఇటీవల హార్ట్‌స్ట్రోక్‌తో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కురవి మేజర్ గ్రామపంచాయతీ సీనియర్ వార్డు సభ్యుడు నూతక్కి సాంబశివరావు బుధవారం భైరవునిపల్లికి వెళ్లి కోటయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ అనుగోజు పూర్ణచందర్‌రావు, అనుగోజు నటరాజ్ తదితరులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. "ధైర్యంగా ఉండండి.. మేమంతా మీకు అండగా ఉన్నాం. మళ్లీ వస్తాం. ఏ అవసరం వచ్చినా ఒక్క ఫోన్ కాల్ చేయండి.. వెంటనే వచ్చి సహాయం చేస్తాం" అని నూతక్కి సాంబశివరావు భరోసా ఇచ్చారు.

**పలువురు జర్నలిస్టుల పరామర్శ**

ఈ పరామర్శ కార్యక్రమంలో కురవి మేజర్ గ్రామపంచాయతీ సీనియర్ వార్డు సభ్యుడు, దళిత రత్న దైద భద్రయ్య, సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ రాష్ట్ర మాల జర్నలిస్టుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బేతమళ్ల సహదేవ్, కురవి మేజర్ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు, జర్నలిస్టులు ప్రమోద్ నాయక్, బానోతు దేవేందర్, బత్తిని సంతోష్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వెల్లడి
- కందకుర్తి,యంచ పుష్కర ఘాట్ల వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- పాల్గొన్న కలెక్టర్,ప్రజాప్రతినిధులు



**నిజామాబాద్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు,సౌకర్యాలు కల్పించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు.వచ్చే ఏడాది జూన్,జూలై మాసాలలో జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పుణ్య స్నానాల కోసం జిల్లాలోని వివిధ పుష్కర క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ల వద్ద సదుపాయాల కల్పన కోసం అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు.త్రివేణి సంగమ ప్రాంతం అయిన రెంజల్ మండలం కందకుర్తి వద్ద,నవీపేట మండలం యంచ వద్ద గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణాలు,ఇతర అభివృద్ధి పనులకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి,కలెక్టర్ భవేష్ మిశ్రా శంకుస్థాపనలు చేశారు.కందకుర్తి వద్ద నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.6.05 కోట్ల అంచనా వ్యయంతో పుష్కర ఘాట్ నిర్మాణానికి,పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.3.90 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణాలకు,దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.5.00 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శంకుస్థాపనలు చేశారు.అదేవిధంగా యంచ వద్ద రూ.2.15 కోట్ల నిధులతో పుష్కర ఘాట్,రూ.70 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ....గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో అట్టహాసంగా నిర్వహించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని అన్నారు.ఒక్క కందకుర్తి పుష్కర క్షేత్రం వద్దనే అన్ని శాఖల పనులను కలుపుకుని సుమారు 30 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నామని వివరించారు.భక్తుల రాకపోకలు,పార్కింగ్,తాగునీరు,పారిశుద్ధ్యం,విద్యుత్,వైద్య సేవలు,దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.భక్తులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా,సురక్షితమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కాగా పనులను నాణ్యతా ప్రమాణాలతో,నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు.పుష్కర ఘాట్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్లాలని అన్నారు.వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,బోధన్ ఆర్డీఓ విజయ కుమారి,తహసీల్దార్లు శ్రవణ్,వెంకట రమణ,ప్రజాప్రతినిధులు,సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# దళితులను అవమానిస్తే సహించేది లేదు

- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం.. తాతా మధు వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం





**వరంగల్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** దళితుల పట్ల అవమానకరంగా వ్యవహరించిన వారికి దళితుల ఓట్లతో తగిన బుద్ధి చెబుతామని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘీ ఎలేందర్ హెచ్చరించారు.తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గురువారం అండర్ బ్రిడ్జి జీవుల అడ్డా వద్ద కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎలేందర్ మాట్లాడుతూ.. దళితులు తమ సమస్యలపై నిరసన తెలిపిన ఫామ్‌హౌస్ ప్రాంతంలో పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయించారనే ఘటన దొర అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. దళితులను అవమానించే ఇలాంటి చర్యలను తెలంగాణ సమాజం సహించబోదన్నారు.అలాగే శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై శాసనమండలి సభ్యుడు తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని దిగజార్చే వ్యాఖ్యలు సహించేది లేదని స్పష్టం చేశారు.తాతా మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని స్పీకర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని, శాసనమండలి సభ్యత్వం నుంచి తొలగించాలని ఎలేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా దళిత సంఘాలు, ప్రజాస్వామిక శక్తులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డిహెచ్పిఎస్ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి తాళ్లపల్లి జాన్ పాల్, జిల్లా ఉపాధ్యక్షులు జన్ను హరిబాబు, ఖిలా వరంగల్ మండల కార్యదర్శి రాచర్ల రాజేందర్, మండల అధ్యక్షులు జన్ను రాజు, గీసుకొండ మండల కార్యదర్శి బాణాల మహేష్, మండల అధ్యక్షులు సిలివేరు రాజేష్తో పాటు బొంకురి ఆరోగ్యం, కళకోట్ల కుమార స్వామి, గిద్దెల మానస, పసునూరి ఇమ్మానియేల్, రత్నం, సుగుణ, వరలక్ష్మి , సంపూర్ణ, మరియ, సింగారపు కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఓయూ నుండి డాక్టరేట్ డిగ్రీని అందుకున్న కేసుపల్లి వాసి






**ఏన్కూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవ కార్యక్రమానికి అతిథిగా తెలంగాణ గవర్నర్, ఛాన్స్లర్ శివ ప్రతాప్ శుక్ల, ముఖ్యఅతిథిగా భారత్ బయోటెక్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం ఇల్లా హాజరై పరిశోధన పూర్తి చేసిన విద్యార్థులకు పీహెచ్డీ డిగ్రీలను ప్రధానం చేశారు. ఏన్కూర్ మండల పరిధిలోని కేసుపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు సాగబోయిన కమలమ్మ, పుల్లయ్య మూడవ సంతానం సాగబోయిన పాపారావు ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో "సబ్ ప్లాన్ అండ్ ట్రైబల్ డెవలప్మెంట్ – ఏ సోషియాలజికల్ స్టడీ ఆఫ్ ఐటీడీఏ భద్రాచలం తెలంగాణ" అనే అంశంపై తాను చేపట్టిన పరిశోధనా పత్రాన్ని యూనివర్సిటీకి సమర్పించినట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవం సందర్భంగా పాల్గొన్న ముఖ్యఅతిథి భారత్ బయోటెక్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎం ఇల్లా, ఓయూ వైస్ ఛాన్స్లర్ ములుగారం కుమార్ చేతుల మీదుగా డాక్టర్ సాగబోయిన పాపారావు తన పీహెచ్డీ డిగ్రీని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుపేద ఆదివాసీ కుటుంబానికి చెందిన నేను ప్రాథమిక విద్యాభ్యాసం కేసుపల్లి ప్రభుత్వ పాఠశాలలో కొనసాగించి, హై స్కూల్ విద్య గిరిజన ఆశ్రమ పాఠశాల రామవరంలో పూర్తిచేసుకుని, సెకండరీ విద్య తార్నాక విశ్వ చైతన్య జూనియర్ కాలేజీలో, డిగ్రీ సిటీ కాలేజ్, పిజి, పిహెచ్డి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తి చేయడం జరిగినదని తెలిపారు. 109 సంవత్సరాల చరిత్రలో ఉస్మానియా విద్యాలయం సోషియాలజీ విభాగం నుండి మొట్టమొదటి ఆదివాసి పరిశోధకుడిగా ఆదివాసి ప్రజల సామాజిక పరిస్థితులపై అధ్యయనం చేసిన తొలి వ్యక్తిగా కేసుపల్లి వాసి సాగబోయిన పాపారావు కావడం ఓయూ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన పేరుగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ అరుదైన అవకాశాన్ని పొందే క్రమంలో అనేక కష్టనష్టాలను,ఆకలి బాధను, అవమానాలను, అవహేళనలను అధిగమించి సమస్యలకు ఎదురొడ్డి లక్ష సాధన కోసం ఎంతటి కష్టానైనా ఇష్టంగా స్వీకరించినందుకు నేడు నాకు లభించిన ఈ గుర్తింపు అని ఆయన పేర్కొన్నారు. సాధించిన జ్ఞానాన్ని, పొందిన అనుభవాన్ని భవిష్యత్తులో సమాజంలో అణగారిన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై లోతైన అధ్యయనం అవగాహనతో ముందుకు సాగుతానని తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అందించిన పీహెచ్డీ డాక్టరేట్ డిగ్రీ నాకు జన్మనిచ్చి ఈ ప్రపంచానికి పరిచయం చేసిన తమ తల్లిదండ్రులకు అంకితం చేశారు. నా జీవిత ప్రయాణంలో నన్ను వెన్ను తట్టి ప్రోత్సహించిన తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు పాదాభివందనాలు తెలియజేశారు.

# తెలంగాణ వీర వనిత -చాకలి ఐలమ్మ వారసత్వాన్ని కొనసాగిస్తాం

- సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పి అంజయ్య



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** యాచారం మండలంలో గురువారం ధర్మన్న గూడా గ్రామంలో తెలంగాణ సాయుదారైతంగా పోరాట నాయకురాలు చిట్యాల ఐలమ్మ 42 వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఆమె పోటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య పాల్గొని మాట్లాడుతూ, భూస్వములు జగిర్ దార్లు సాగించిన దోపిడీ దౌర్జన్యాలు వెట్టిచాకి సాగిస్తు నీ బాంచన్ దొర నీ కాళ్ళు మొక్కుతా అన్న రోజుల్లో ఐలమ్మ భూస్వాములకు దీటుగా స్వయంగా భూమి కౌలుకు తీసుకో పంట వేసి పండిన పంట కళ్ళంలో వున్నా సందర్భంగా,రామచంద్ర రెడ్డి రజాకార్ల గుండాలు పంటను తీసుకా పోయే ప్రయత్నంలో ఆమె ఎర్ర జండా నాయకత్వంలో ధైర్యంగా ఎదురు తిరిగి గుండాలను ఎదిరించి, పంటను కాపాడుకున్న గొప్ప విరవనీత ఆమె తిరుగు బాటు తెలంగాణ సాయుదా పోరాటానికి నాంది పలికింది.ఏ చరిత్ర లేని బీజేపీ వారు చరిత్రను వక్రీకరిస్తూ హిందూ,ముస్లింల మధ్య జరిగిన పోరాటమని ప్రచారం చేస్తున్నారు.ఈరోజు నుండి 17 వరకు తెలంగాణ సాయుదా రైతంగా పోరాట వారోత్సవాలు జరుగుతున్నవి 16 న ఇబ్రహీంపట్నంలో పెద్ద ఎత్తున జరిగే కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలనీ పిలుపు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఎం బాల్ రాజ్,మాజీ వైస్ ఎంపీపీ ఎం శ్రీమన్నారాయణ,మాజీ సర్పంచ్ ఎం భాషయ్య ,సీపీఎం పార్టీ శాఖ కార్యదర్శి పి రమేష్,ఎం రాములు,ఎన్ సత్తయ్య,పి సత్యనారాయణ,ఎం సత్తయ్య బి కోటయ్య ,ఎం రామక్రిష్ణ,ఏ రాములు బి,రాములు,కె రమేష్ అరిగే రాములు శ్రీను టి దన్ రాజ్ బిక్షపతి మారమ్మ సాయిలమ్మ పోషమ్మ అంజమ్మ లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసును ఛేదించిన మామునూరు పోలీసులు

- నలుగురు నిందితుల అరెస్ట్.. ఐదు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, కత్తి స్వాధీనం

**వరంగల్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** హత్య, హత్యాయత్నం కేసును మామునూరు పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, కత్తిని స్వాధీనం చేసుకున్నారు.మామునూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను తూర్పు మండల పోలీసు ఉప కమిషనర్ అంకిత్ కుమార్ శంక్వర్ వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్, భట్టుపల్లి, అమ్మవారిపేట పరిసర ప్రాంతాల్లో సామల పవన్, ఈద జానకిరామ్, ముద్దెపాక మనోజ్, ఎస్.డి. హుస్సేన్ ముఠాగా ఏర్పడి నిర్మానుష్య ప్రాంతాల్లో ఏకాంతంగా ఉన్న జంటలను బెదిరించేవారు. వారి వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేసేవారని పోలీసులు తెలిపారు.ఈ క్రమంలో ఆగస్టు 30న భట్టుపల్లి రోడ్డు వద్ద ఓ జంటను బెదిరించి వీడియో తీసిన ఘటనపై ఇరువర్గాల మధ్య వివాదం ఏర్పడింది. అనంతరం బెదిరింపులు, డబ్బుల డిమాండ్ విషయంలో ఫోన్‌లో పలుమార్లు గొడవలు జరిగినట్లు పోలీసులు పేర్కొన్నారు.

**కత్తితో దాడి.. యువకుడి మృతి**

సెప్టెంబర్ 4న రాత్రి వివాదం ముదరడంతో నలుగురు నిందితులు కత్తితో ద్విచక్ర వాహనాలపై బయలుదేరారు. బేస్తం చెరువు వైపు వెళ్లే మట్టి రోడ్డు వద్ద ఇరువర్గాలు ఎదురుపడగా ఘర్షణ చోటుచేసుకుంది. ఈ సమయంలో మేకల గౌతమ్‌పై




కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన రోహిత్‌పై కూడా దాడి చేయడంతో అతని కాలికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

**వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డారు**

సెప్టెంబర్ 9న ఉదయం ఆర్‌టీఓ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న మామునూరు పోలీసులు, పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.అరెస్టయిన వారిలో సామల పవన్ (25), ఈద జానకిరామ్ (22), ముద్దెపాక మనోజ్ (21), ఎస్.డి. హుస్సేన్ ఉన్నారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన మామునూరు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పర్వతగిరి వలయ ఇన్‌స్పెక్టర్ సంతోష్, ఉప ఇన్స్పెక్టర్లు ప్రవీణ్, నిస్సార్ పాషా, హరిశంకర్, పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**మణుగూరు, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**

పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు మణుగూరు తెలంగాణ వీర వనితచాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను మణుగూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు పీరీనాకి నవీన్ ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్,ల ఆధ్వర్యంలో మణుగూరు హనుమాన్ టెంపుల్ క్రాస్ రోడ్డు వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం ,భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాముల పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా,అణిచివేతకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ అని ఆ మహనీయురాలు ఆశయాలను అందరూ కొనసాగించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కూచిపూడి బాబు, పాతూరు వెంకన్న, మణుగూరు మండల రజక సంఘం అధ్యక్షులు ఘంటసాల శ్రీను, మైనారిటీ సెల్



అధ్యక్షులు రహీం భాష, మణుగూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు బర్ల శ్వేతన్, పట్టణ అధ్యక్షులు పోడుతూరి రవి, బత్తుల శ్రీను ,దొడ్డిపనేని మధుకుమార్, కొర్లకుంట అప్పారావు, సలీం ,వాసంశెట్టి వెంకట్రావు, పల్లం నాగేశ్వరరావు, పోడుతూరి నానాజీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య , వేముల స్వరూప, చప్పిడి మాధురి, షబానా తదితరులు పాల్గొన్నారు.

# నీటి వనరులు వృధా కాకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలి

- అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్, సెప్టెంబర్ 10 , నేటి శుభోదయ :**




ఎల్ నినో ప్రభావంతో వర్షాభావం నెలకొని ఉన్న ప్రస్తుత తరుణంలో,అందుబాటులో ఉన్న నీటి వనరులు వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల అధికారులతో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమీక్ష జరిపారు.వివిధ జలాశయాలలో అందుబాటులో ఉన్న నీటి నిల్వల గురించి ఇరిగేషన్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.గత ఏడాదితో పోలిస్తే శ్రీరాంసాగర్ సహా ఇతర ప్రాజెక్టుల్లో అతి తక్కువ నీటి నిల్వలు మాత్రమే అందుబాటులో ఉన్నాయన్నారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ఎక్కడ కూడా చుక్క నీరు సైతం వృధా కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.తాగు నీటి అవసరాలకు నీటిని నిలువ ఉంచుతూ,పంటలను కాపాడేందుకు వీలుగా రెండు తడుల వరకు సాగు నీటిని విడుదల చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు.నిజాంసాగర్,శ్రీరాంసాగర్ జలాలు చివరి ఆయకట్టు వరకు చేరేలా గట్టి నిఘా ఉంచాలని,నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ నీటి నిల్వలు వృధా కాకుండా చూడాలని సూచించారు.ఈ విషయంలో ఎవరైనా నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.రైతుల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలలో ఏంతమాత్రం రాజీ పడబోమని,నీటి వృధా జరిగి పంటలు ఎండితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని తేల్చి చెప్పారు.నీటి వృధాను నిలువరించేందుకు అవసరమైన చోట కాలువలు,తూముల మరమ్మతులు వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని,ఈ పనులకు కావాల్సిన నిధులను సమకూరుస్తామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ రైతులకు అవసరమైన సలహాలు,సూచనలు అందించాలని అన్నారు.ఖరీఫ్ పంట సేకరణకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు వీలుగా గోడౌన్ లలో నిలువ ఉన్న బియ్యం నిల్వలను నిర్దేశిత ప్రాంతాలకు వేగంగా తరలించాలని సూచించారు.ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకుంటున్న బాలబాలికలకు ఏకరూప దుస్తులను త్వరితగతిన అందించాలని సూచించారు.విద్యార్థిని,విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యతతో యూనిఫాంలు కుట్టి అందించేలా స్వయం సహాయక సంఘాలకు బాధ్యతను అప్పగించడం జరిగిందని,వారు సకాలంలో దుస్తులు కుట్టి ఇచ్చేలా చూడాలన్నారు.సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,జిల్లా రెవెన్యూ అధికారిణి గీత,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,పౌర సరఫరాల శాఖ అధికారి అరవింద్ రెడ్డి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గణేష్ నవరాత్రుల ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి



**తలకొండపల్లి, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు, భక్తులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మహేశ్వరం ఏసీపీ జానకి రెడ్డి సూచించారు. తలకొండపల్లి మండల కేంద్రం దేవకి గార్డెన్ ఫంక్షన్ హాల్ లో గురువారం తలకొండపల్లి ఎస్సై కె.శేఖర్ ఆధ్వర్యంలో గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులకు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహేశ్వరం ఏసిపి జానకి రెడ్డి మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రుల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని, మండపాల వద్ద విద్యుత్ జాగ్రత్తలు, అగ్నిమాపక ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.చిన్నారులు విద్యుత్ పరిచయాలకు దూరంగా ఉండేటట్లు జాగ్రత్తలు వహించాలని సూచించారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. గణేష్ మండపాల వద్ద గృహకు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే డీజే సౌండ్‌కు అనుమతి లేదన్నారు.ఈ కార్యక్రమంలో కడ్తాల్ ఇన్స్పెక్టర్ సైదా రెడ్డి, పోలీసులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# హైదరాబాదులో జరిగే కేజీబీవీ మహాధర్నాను జయప్రదం చేయండి.



**నిజామాబాద్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**

తెలంగాణ రాష్ట్రంలోని కేజీబీవీ లో పనిచేస్తున్న నాన్ టీచింగ్,వర్కర్ల వేతనాల పెంపు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 11న హైదరాబాద్ లో ఇందిరాపార్క్ వద్ద జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రచార కరపత్రాలను మోపాల్ కేజీబీవీలో ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ....కేజీబీవీ నాన్ టీచింగ్,వర్కర్ల పట్ల ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి కేజీబీవీ సిబ్బంది వేతనాలను సమీక్షించాలన్నారు.ఏళ్లుగా వీరికి వేతనాలు పెరగలేదని,పైగా పని భారం పెరిగిందన్నారు.సమస్యలు పరిష్కరించమని విన్నవిస్తే,అదనంగా నైట్ డ్యూటీలు వేశారని ఆరోపించారు.కేజీబీవీల పట్ల గత ప్రభుత్వం కంటే కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మూడేళ్లుగా అధికారులను ప్రభుత్వాన్ని ప్రజాప్రతినిధులను కలిసి విన్నవిస్తూనే ఉన్నామని,ఇక పోరాటం తప్ప మరోమార్గం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలనైనా తక్షణమే అమలు చేయాలన్నారు.అకౌంటెంట్,వర్కర్లకు నిబంధనలకు,జాబ్ చార్ట్ కు భిన్నంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు.వారానికి ఒకరోజు సెలవు చొప్పున వర్కర్లకు వీక్లీఆఫ్ అమలు చేయాలన్నారు.ఖాళీ పోస్టులు భర్తీచేసి పనిభారం తగ్గించాలన్నారు.ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హతలు ఉన్న నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజీ ఇవ్వాలన్నారు.రిటైర్మెంట్ వయసును 65 సంవత్సరాలకు పెంచాలని,రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు.పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ,ఆరోగ్యభద్రత కల్పించాలన్నారు.రేపు హైదరాబాద్ ఇందిరా పార్క్ లో జరిగే మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేజీబీవీల నాన్ టీచింగ్,వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుమలత,కేజీబీవీ సిబ్బంది కావ్య,పద్మ,ప్రేమ,లక్ష్మి ,వాసుకి,భారతి,సంతోషి,గోదావరి తదితరులు పాల్గొన్నారు.

# కేశంపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

- ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం: సర్పంచ్, ప్యాక్స్ చైర్మన్, సీఐ



**కేశంపేట, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
కేశంపేట మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, అమరవీరురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షుడు వెంకటాపురం రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి స్థానిక ప్రజలు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష్, ప్యాక్స్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, సీఐ నరహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొరల అన్యాయాలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆమె చూపిన ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఆమె త్యాగాలను ఎప్పటికీ మరువదన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహ, రమణ గౌడ్, రజక సంఘం నాయకులు ఆంజనేయులు, ఆలుగొండ శ్రీనయ్య, నరసింహులు, సంతాపూర్ రాజు, శ్రీనివాస్, శీను, రమేష్, రవి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఐలమ్మ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు.

# క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం : అర్థ సుధాకర్ రెడ్డి





**వికారాబాద్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ**
వికారాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, టీజేఎంయుగౌరవ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి తన సొంత నిధులతో అనంతగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు.అనంతగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 105 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కటి రూ.400 విలువైన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. మొత్తం రూ.42 వేల విలువైన దుస్తులను సుధాకర్ రెడ్డి స్వయంగా సమకూర్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, వికారాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు బాలరాజు, కురువ శీను, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున ప్రైవేట్ స్కూల్ పై సమగ్ర విచారణ చేపట్టాలని డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

- అనుమతులు లేవంటున్నారు.. గుర్తింపు ఎలా వచ్చింది?
- నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై సమగ్ర విచారణకు డిమాండ్
- విద్యాశాఖ–గ్రామపంచాయతీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలి
- గ్రామసభ తీర్మానాన్ని అమలు చేసి నివేదికను బహిర్గతం చేయాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** కురవి మండల కేంద్రంలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై వస్తున్న ఆరోపణలపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలోని డా.బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ అనుమతులు లేవని అధికారులు చెబుతున్నప్పుడు.. అదే పాఠశాలకు విద్యాశాఖ గుర్తింపు ఎలా లభించింది? అనే ప్రశ్నకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాల భవన నిర్మాణాలు, అదనపు నిర్మాణాలు, భవన భద్రత, గ్రామపంచాయతీ అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు తదితర అంశాలపై వస్తున్న ఆరోపణలను అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.ఆరోపణలు వెలువడినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో అధికారుల నిర్లక్ష్యానికి తావుండకూడదని అన్నారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో సంయుక్త తనిఖీలు నిర్వహించి పాఠశాల నిర్మాణాలు, అనుమతులు, గుర్తింపుకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించాలని కోరారు.నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అధికారికంగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమతులు, గుర్తింపు విషయంలో ఏదైనా లోపం ఉంటే దానికి బాధ్యత ఎవరిదో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే గ్రామసభలో తీసుకున్న తీర్మానాన్ని వెంటనే అమలు చేసి, సమగ్ర విచారణ నిర్వహించి నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థులు చదువుకునే పాఠశాల భవనాల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. తక్షణమే సంయుక్త తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తదుపరి దశలో ఆందోళనలు చేపడతామని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ హెచ్చరించారు.

# నిర్దవెల్లిలో ఘనంగా ఏడు మెట్ల మైసమ్మ బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు.. బోనాలతో తరలివచ్చిన మహిళలు



**కేశంపేట, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో గురువారం ఏడు మెట్ల మైసమ్మ బోనాల పండుగను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా గ్రామంలోని మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అందంగా అలంకరించి నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. డప్పుల దరువులు, భక్తిగీతాలు, అమ్మవారి నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏడు మెట్ల మైసమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. బోనాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపసర్పంచ్ సఫూర అమేర్, వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, రమేష్ నాయక్, రిజ్వాన బేగం, మోహిజ్, మంజుల, జంగేశ్, వెంకటమ్మ, మల్లయ్య, మాజీ సర్పంచ్ జంగయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, గ్రామ నాయకులు దిద్దెల జంగయ్య, బడుక మల్లయ్య, ముత్యాలు, ఖాజా, బొడ మల్లేష్, రాజేందర్, శివతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సాయి నగర్‌లో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ – SIR నోటీసులపై ఓటర్లకు అవగాహన



**నాగోల్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ వార్డ్ ఆఫీసులో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వినాయక చవితి సందర్భంగా ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని ఈ సందర్భంగా నాయకులు, కాలనీవాసులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొని కాలనీవాసులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు.పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు.అనంతరం శ్రీ సాయి నగర్ వార్డ్ ఆఫీసులో SIR ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కు సంబంధించి ఓటర్లకు వచ్చిన నోటీసులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోటీసులు ఎందుకు వచ్చాయి,వాటిలో పేర్కొన్న వివరాలను ఎలా పరిశీలించాలి, ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను ఎలా సరిచూసుకోవాలి అనే అంశాలపై ఓటర్లకు చింతల అరుణ సురేందర్ యాదవ్ వివరించారు.ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కు రక్షించబడేలా ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత బి ఎల్ ఓ ల సహకారంతో వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో జి ఎస్ ఐ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, పంగ శ్యామ్ కుమార్ బద్దం బాలకృష్ణ గౌడ్, కాలనీవాసులు, డి ఈ సందీప్, జవాన్ దర్శన్,ఎస్ ఎఫ్ ఏ సురేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# మహంకాళి సికింద్రాబాద్ జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్ గా మనోజ్ ఉపాధ్యాయ్ నియామకం

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** భారతీయ జనతా పార్టీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా పబ్లిసిటీ సెల్ కన్వీనర్ గా రాంగోపాల్ పేట్కు చెందిన బిజేపీ సీనియర్ నాయకులు మనోజ్ ఉపాధ్యాయ్ నియమించబడ్డారు. ఈ మేరకు జిల్లా కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు గుండుగోని భరత్ గౌడ్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ ఉపాధ్యాయ్ మాట్లాడుతూ... మహంకాళి సికింద్రాబాద్ జిల్లా కార్యవర్గంలో పదవిని అప్పగించిన భరత్ గౌడ్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా కృషి చేస్తానని భరత్ గౌడ్ కు ధన్యవాధాలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి, పార్టీ కార్యక్రమాలను తనవంతుగా విస్తృత ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రదాన కార్యదర్శులు నెమలి ఆనంద్, సారంగపాణి, రమేష్ రామ్. జిల్లా కార్యాలయ కార్యదర్శి కిరణ్ కుమార్, రాంగోపాల్ పేట్



డివిజన్ అధ్యక్షులు భవర్లాల్ సందీప్ వర్మ, ప్రధాన కార్యదర్శి అనిష్ పర్మ తదితరులు పాల్గొని ఆనంద్ వ్యాస్ కు శుభాకాంక్షలు తెలిపారు.

## తండ్రి లేని పేదింటి ఆడపిల్ల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండ

- **పుట్టిన గడ్డ రుణం తీర్చుకుంటున్న ఉప్పల**
- **పుస్తె మట్టెలు, చీర, గాజులు అందజేసిన ఉప్పల శ్రీనివాస్ గుప్త**

**నాగోల్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
తండ్రి లేని పేదింటి దళిత సామాజిక వర్గానికి చెందిన ఆడపిల్ల వివాహానికి ఉప్పల ఫౌండేషన్ అండగా నిలిచింది. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవ్‌పల్లి గ్రామానికి చెందిన గుండెల్లి యాదమ్మ–కీ.శే. కిషన్ దంపతుల కుటుంబానికి చెందిన ఆడపిల్ల వివాహం సందర్భంగా ఉప్పల ఫౌండేషన్ తరఫున చీర గాజులు పూస్తే మట్టెలు అందజేశారు.నాగోల్‌లోని ఉప్పల శ్రీనివాస్ గుప్త గారి నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, స్వయంగా వధువుకు పుస్తె మట్టెలు, చీర, గాజులు అందజేసి, నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త,మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో వివాహం చేసుకోలేని పేద కుటుంబాలకు తమ వంతు సహాయం అందించడం ఉప్పల ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. తండ్రి లేని ఆడపిల్ల వివాహానికి అండగా నిలవడం తనకు ఎంతో సంతృప్తిని కలిగించిందన్నారు.నూతన వధూవరులు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో, అన్యోన్యంగా జీవించాలని ఆకాంక్షించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన సమయంలో అండగా నిలుస్తూ ఉప్పల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల ఫౌండేషన్ కో చైర్మన్ ఉప్పల స్వప్న, లక్ష్మి దేవ్ పల్లి గ్రామానికి చెందిన యువజన సంఘం నాయకుడు కనక రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కొండల్ రెడ్డి కంపెనీకి అక్రమంగా కట్టబెట్టిన భూమిని పరిశీలించిన కేటీఆర్,హరీష్ రావు,బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం..

- **రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి భారీగా తరలి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు**

**రాజేంద్రనగర్,సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :**
కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేయడంతో ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావు,సబిత ఇంద్రారెడ్డి,ఇతర ఎమ్మెల్యేల బృందం సిద్ధమైంది..ప్రత్యేక సమావేశం అయిన అనంతరం గురువారం కేటీఆర్ తో పాటు ఎమ్మెల్యేల బృందం రంగారెడ్డి జిల్లాలోని కొంగర,ర్యావిరాలకు సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి కంపెనీకి ఫోర్త్ సిటీలో అక్రమంగా కట్టబెట్టిన భూమిని పరిశీలించారు.కేటీఆర్ పిలుపుతో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.కాంగ్రెస్ ప్రభుత్వం కొండల్ రెడ్డి కంపెనీ టెసెరాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్స్‌కు రూ.200కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7కోట్లకు కట్టబెట్టింది.కాగా,కేవలం రూ.లక్షతో మొదలైన టెస్సెరాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన 5ఎకరాల భూమిని కేటాయించి రేవంత్ రెడ్డి అతిపెద్ద కుంభకోణానికి పాల్పడ్డాడని కేటీఆర్ ఆరోపించారు.టెస్సెరాక్ట్ అడ్వాన్స్డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి నేను చైర్మన్‌గా





ఉన్నానని రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి లింక్డ్ఇన్ బయోలో పెట్టుకున్నాడు.రేవంత్ రెడ్డి సోదరులందరికీ పొట్ట కోస్తే అక్షరం ముక్క రాదు వీళ్ళందరూ ఉన్నట్లుండి కోట్లు బూట్లు వేసుకొని పెద్ద పెద్ద కంపెనీలకు చైర్మన్లు ఎలా అయ్యారు అని ప్రశ్నించారు.తరలివెళ్లిన వారిలో రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి,శీలం తిరుపతిరెడ్డి,మహమ్మద్ జహీరుద్దీన్,దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

## పినపాకలో భూ సేకరణ కాదు.. రీ సర్వే మాత్రమే

**పినపాక , సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :**
పినపాక మండలంలో చేపడుతున్నది కేవలం రి–సర్వే మాత్రమేనని, భూ సేకరణ సర్వే కాదని తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. రి–సర్వేపై ప్రజలు ఎలాంటి అపోహాలు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. రైతుల సమక్షంలో భూముల హద్దులను జీపీఎస్ సాంకేతికత ద్వారా గుర్తించి, ఖచ్చితమైన మ్యాప్‌ను తయారు చేస్తున్నట్లు తెలిపారు. పినపాక మండలంలోని 8 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వ భూములతో పాటు ప్రైవేటు భూములను కూడా సర్వే చేసి వివరాలను నమోదు చేస్తామని తెలిపారు. భూముల వివరాలు, హద్దుల విషయంలో స్పష్టత తీసుకురావడమే రి–సర్వే ప్రధాన ఉద్దేశమని తహసీల్దార్ వెల్లడించారు. రైతులు, భూ యజమానులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అనిత, సర్వేయర్ నరేష్, జిపిఓలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## కుక్కల దాడిలో 8 మేక పిల్లలు మృతి



**డిండి(గుండ్లపల్లి), సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** డిండి మండలంలో కుక్కల దాడిలో బూర లింగమయ్యకు చెందిన 8 మేక పిల్లలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బూర లింగమయ్య ఇంటి సమీపంలో మేక పిల్లలను ఉంచగా, కుక్కలు గుంపుగా దాడి చేసినట్లు సమాచారం.కుక్కల దాడిలో 8 మేక పిల్లలు మృతి చెందడంతో బూర లింగమయ్య కుటుంబం తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఈ ఘటనతో బాధిత కుటుంబానికి ఆర్థిక నష్టం వాటిల్లింది. గ్రామాల్లో వీధికుక్కల బెడద పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు వెంటనే స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే మృతి చెందిన మేక పిల్లలకు ప్రభుత్వం తగిన పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నారు.

## ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం కొంగు నడుముకు చుట్టి కొడవలి చేతపట్టి తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తితో ప్రపంచానికి చాటి చెప్పిన వీరనారి" చాకలి ఐలమ్మ గారి 41వ వర్ధంతి సందర్భంగా ఎల్బీనగర్ చింతలకుంట చాకలి ఐలమ్మ విగ్రహానికి మన కొత్తపేట డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మంచి రాజేష్ కుమార్ సీనియర్ నాయకులు వజీర్ కుమార్ గౌడ్, డివిజన్ సెక్రెటరీ సట్టు చంద్ర శేఖర్ పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. వారు మాట్లాడుతూ.. దొరల ఆధిపత్యం పై తిరగబడిన వీరనారి భూమి కోసం మడమ తిప్పని పోరాటం, ఆమె యొక్క ఆశయ అడుగుజాడల్లో నడుస్తూ ధైర్య సాహసాలకు, ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మనం ముందుకు సాగాలని... తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో రవి, నిరంజన్,శ్రీనివాస్ , సాయి,మహేష్,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచిన జర్పుల భాస్కర్ నాయక్

- **ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న రాములు నాయక్‌కు రూ.10 వేల ఆర్థిక సహాయం**



**మిడ్జిల్: సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** మిడ్జిల్: ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, అవసరమైన సమయంలో ఆర్థిక సహాయం అందిస్తున్న స్వచ్ఛంద సేవకుడు జర్పుల భాస్కర్ నాయక్ మరోసారి తన సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. బాలానగర్ మండల పరిధిలోని పల్గుమీది తండా గ్రామపంచాయతీకి చెందిన కేతావత్ రాములు నాయక్ గత రెండేళ్లుగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జర్పుల భాస్కర్ నాయక్, JBN యువసేన సభ్యులు ఆయన కుటుంబానికి అండగా నిలిచారు.JBN యువసేన సభ్యుడు చందు నాయక్ ఆధ్వర్యంలో రాములు నాయక్ కుటుంబాన్ని పరామర్శించి రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న రాములు నాయక్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వైద్య చికిత్సకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చారు.అంతేకాకుండా రాములు నాయక్ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆయనకు అవసరమైన రెస్పిరేటరీ మిషన్‌ను త్వరలోనే అందజేస్తామని జర్పుల భాస్కర్ నాయక్ హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి ఆర్థికంగా, మానసికంగా అండగా నిలవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, ఎలాంటి పదవి లేదా ప్రచారం ఆశించకుండా అవసరమైన వారికి సహాయం చేయడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని, సమాజంలో సేవా భావాన్ని మరింత పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో JBN యువసేన సభ్యులు, నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. ప్రజల కష్టాల్లో తోడుగా ఉంటూ, అవసరమైన వారికి తనవంతు సహాయాన్ని అందిస్తున్న జర్పుల భాస్కర్ నాయక్ సేవా స్ఫూర్తిని పలువురు అభినందించారు.

# దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఉచిత సహాయ పరికరాలు



**శంషాబాద్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** శంషాబాద్ మున్సిపల్ కమ్యూనిటీ హాల్‌లో దివ్యాంగ విద్యార్థులకు ఉచిత సహాయ పరికరాలు అందించేందుకు ప్రత్యేక గుర్తింపు, వైద్య నిర్ధారణ శిబిరం నిర్వహించారు. సమగ్ర శిక్ష సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో, సీఎంఓ బత్తిని వెంకటేష్ పర్యవేక్షణలో ఈ శిబిరం జరిగింది. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెంది స్వతంత్రంగా జీవించేందుకు ప్రభుత్వం ఉచితంగా సహాయ పరికరాలు అందిస్తోందని తెలిపారు. వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి పరికరాలు, బ్రెయిలీ పరికరాలు, ఎమ్మార్ కిట్లు తదితరాలను అర్హులైన విద్యార్థులకు అందించేందుకు ఎంపిక ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. అలింకో సంస్థ సహకారంతో విద్యార్థుల అవసరాలను గుర్తించి పరికరాలు అందించనున్నట్లు తెలిపారు. శిబిరంలో శంషాబాద్ మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్, శంషాబాద్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కిష్టారెడ్డి, సహిత విద్య వనరుల ఉపాధ్యాయులు, ప్రత్యేక ఉపాధ్యాయులు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పుట్టోనిగూడ గ్రామ ప్రజలకు ఉపయోగపడే మట్టిని అమ్ముకుంటే ఎలా

## - మాజీ వార్డు సభ్యులు జంగా శేఖర్ యాదవ్.



**షాద్ నగర్, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** మన గ్రామంలో గ్రామ కంఠంలో ఉన్న సర్వే నెంబర్ 206లో 8 ఎకరాల 20 గుంటల భూమి గ్రామ ఉపయోగ కోసం మాజీ సర్పంచ్ జగన్ నాయక్ హయాంలో కేటాయించడం జరిగిందని బిఆర్ఎస్ పార్టీ నాయకులు,మాజీ వార్డ్ మెంబర్ జంగా శేఖర్ యాదవ్ తెలిపారు.గ్రామంలో ఎవరైనా ఇల్లు కట్టుకుంటే పిడికెడు మట్టి దొరకకుండా ఇతరులకు అమ్ముకోవడం చాలా దుర్మార్గం అని ఆయన హెచ్చరించారు. గ్రామ ప్రజలందరూ గ్రామ ముఖ్య నాయకుడి చెప్పిన మాటలకు విని రాబోవు రోజులలో ఇంటి నిర్మాణం బేస్మెంట్ నింపడానికి సైతం దూరప్రాంతాలకు వెళ్లి లక్షలు ఖర్చుపెట్టి మట్టిని కొనుక్కునే దుస్థితి ఏర్పడుతుందని ఆయన సూచించారు.అందుకు మన గ్రామంలో ఉన్న గ్రామ కంఠం భూమిని జాగ్రత్తగా చూసుకుంటే నిరుపేదలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని ఆయన తెలిపారు.ఇక్కడ ఎవరైనా మట్టి తవ్వకాలు చేపడితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారిపై క్రిమినల్ కేసులు వేయించడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. గ్రామ అభివృద్ధి కోసం తోడ్పడితే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు,కానీ ధన దాహం కోసం మటిని విక్రయాలు చేస్తే ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.అంతేకాకుండా కేశంపేట మండల తహసిల్దార్,షాద్నగర్ ఆర్డిఓ,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా మట్టి తవ్వకాలను ఆపివేయాలని ఆయన కోరారు.

# సిఎంసీ కమిషనర్‌కు విత్తన గణేష్ విగ్రహం అందజేసిన చిర్ర రవీందర్ యాదవ్..

## - పర్యావరణ పరిరక్షణకు విత్తన గణేష్ ప్రోత్సాహం..



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డా. జి. సృజనను తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు చిర్ర రవీందర్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి విత్తన గణేష్ విగ్రహాన్ని అందజేశారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా గణేష్ ఉత్సవాల్లో మట్టి, విత్తనాలతో రూపొందించిన విగ్రహాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. విగ్రహాల నిమజ్జనం అనంతరం విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా ఎదిగే విధంగా రూపొందించే విత్తన గణేష్ పర్యావరణ హితమైన సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని చిర్ర రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నేతలు మిద్దెల మల్లారెడ్డి, గంగారాం, సంగారెడ్డి ప్రశాంత్ పాల్గొన్నారు.

# వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి

- **ఉత్సవ కమిటీల నిర్వాహకులతో సమావేశం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. స్వామి**



**మంథని, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** మంథని పోలీస్ స్టేషన్లో రెవెన్యూ , మున్సిపల్, విద్యుత్, పలు శాఖల అధికారులతో గురువారం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి స్వామి, సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ తో కలసి వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వినాయక మండప నిర్వహకులకు పలు సూచనలు చేశారు. వినాయక విగ్రహాల ఏర్పాటు చేయుటకు పోలీస్పోర్టల్ లో వివరాలు పొందుపరిచి అప్లికేషన్ను సంబంధిత పోలీస్ స్టేషన్లో అందజేయాలని సూచించారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు వారి సూచనలు పాటిస్తూ సహకరించగలరని కోరారు. గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతి తోనే కనెక్షన్ తీసుకోవాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు మండపంలో బాధ్యత వహించే వారి వివరాలు ఫోన్ నెంబర్లను మండపంలో అందుబాటులో ఉంచాలి. రాజకీయ నాయకులకు సంబంధించిన స్లొగన్స్ వాడకూడదు.గణేష్ మండపంలో 24 గంటలు ముగ్గురు వాలంటీర్లు ఉండే విధంగా నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలి. గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను రాత్రి పది గంటల వరకు మాత్రమే వినియోగించాలని ఎవరైనా నిర్వాహకులు లౌడ్ స్పీకర్లు డిజె సౌండ్ సిస్టం ఏర్పాటు చేస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు వంశీ , కుర్ర లింగయ్య, మాజీ ఎంపీపీ కొండ శంకర్, నాయకులు బండారి ప్రసాద్, లైసెట్టి రాజు, జంబోజు సమ్మయ్య, ఉత్సవ కమిటీ నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వెల్జాల్‌లో వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు

- **అంగరంగ వైభవంగా బోనాల సమర్పణ**
- **సర్పంచ్ వానరాశి రాములమ్మ, తనయుడు వానరాసి వెంకటేష్**
- **మాజీ ఎం పి పి సిఎల్ శ్రీనివాస్ యాదవ్,మాజీ ఎంపీటీసీ అంబాజీ**





**తలకొండపల్లి, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్ గ్రామంలో పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో, అంగరంగ వైభవంగా గురువారం నిర్వహించారు.సర్పంచ్ వానరాశి రాములమ్మ ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి వాడ నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు.డప్పు వాయిద్యాలు, డమరుకాల మోతలు, విన్యాసాలు, గ్రామ యువకుల ఉత్సాహంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించడంతో గ్రామం భక్తులతో కిక్కిరిసింది. బోనాల పండుగ సందర్భంగా ఆలయాలన్నీ ప్రత్యేక అలంకరణతో ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ హాజరై అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్జాల్ గ్రామంలో ఈసారి పోచమ్మ తల్లి బోనాల పండుగ ఎంతో అద్భుతంగా, భక్తిభావంతో నిర్వహించడం అభినందనీయమన్నారు.గ్రామ సర్పంచ్ రాములమ్మతో పాటు తనయుడు వాన రాశి వెంకటేష్ బోనాల నిర్వహణకు సహకరించిన గ్రామ పెద్దలు, యువకులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్ కుమార్, జిల్లా కో ఆప్షన్ మాజీ సభ్యుడు ముజీబ్ రహమాన్,రిపోర్టర్ విష్ణువర్ధన్ యాదవ్, విజయ్ యాదవ్,గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీ అంబాజీ, వార్డు సభ్యులు, గ్రామ యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ యువ నాయకుల అరెస్టు




**సంగారెడ్డి, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీఆర్ఎస్ యువ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేల గొంతును అణచివేసే విధంగా ప్రభుత్వం వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం, ప్రజల గొంతును వినిపించడం ప్రతిపక్షాలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు, అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమైన తమను ముందస్తుగా అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ప్రతిపక్ష గొంతును అణచివేయడం ద్వారా ప్రజల సమస్యలను మరుగునపెట్టలేరని, బీఆర్ఎస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువత నాయకులు శ్రవణ్ రెడ్డి, 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ లాడే బాలు, చిన్నా తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు

**ముత్తారం, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** ముత్తారం మండలం లక్కారం గ్రామంలో చాకలి ఐలమ్మ 41 వ వర్ధంతి వేడుకలు గ్రామపంచాయతీలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అత్తె చంద్రమౌళి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పాత్ర చిరస్మరణీయమని,నైజాం భూస్వాములకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ ధైర్యసహసాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాదాసి స్రవంతి–శ్రీకాంత్ లతోపాటు పలువురువార్డు సభ్యులు,పంచాయతీ సెక్రెటరీ దిలీప్,గ్రామస్తులు పాల్గొన్నారు.



# పట్టా ఉన్నా... పట్టించుకోని వైనం.!

## సిద్దిపేటలో రెవెన్యూ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

- సిద్దిపేటలో వృద్ధురాలి భూమికి రక్షణ కరువు
- కొలతలకు డీడీ కట్టి 7 నెలలు.. కదలని ఫైలు, రాని అధికారులు
- సర్వేకు ఉన్నతాధికారి రాకుండా అసిస్టెంట్లను పంపి తప్పుడు నివేదిక.?
- కబ్జాదారులకు అనుకూలంగా ఫెన్సింగ్ వేసి అదే హద్దు అంటూ నిర్ణయం? ఫోటోలే సాక్ష్యం
- న్యాయం కోసం కలెక్టర్ ను ఆశ్రయించిన బాధితురాలు



**సిద్దిపేట, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం అంకాపూర్ గ్రామంలో ఓ వృద్ధురాలి కన్నీటి గాథ వెలుగులోకి వచ్చింది. పట్టా పాస్ పుస్తకం ఉన్న తన సొంత భూమిని కాపాడుకోవడం కోసం ఆమె ఏడు నెలలుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతోంది. ఫీజు కట్టినా కొలతలు వేయని అధికారులు, ఫెన్సింగ్ ధ్వంసమైనా పట్టించుకోని యంత్రాంగం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంకాపూర్ గ్రామానికి చెందిన బాధితురాలు రుక్కమ్మకు గ్రామ శివారులో సర్వే నెం. 40 లో పట్టా భూమి ఉంది. దీనికి సంబంధించి పట్టాదార్ పాస్ పుస్తకం, ఖాతా నెంబర్ తో సహా అన్ని రెవెన్యూ రికార్డులు ఆమె పేరిటే ఉన్నాయి. కానీ రోజుకో తీరు.. ఒకరోజు 17 గుంటలు తక్కువగా ఉంది.. ఒకరోజు 36 గుంటలు తక్కువగా ఉంది అని అధికారులు చెబుతున్న తీరు.. దీనిపై అధికారుల నిర్లక్ష్యమా వారు ఎవరికి సపోర్ట్ చేస్తున్నారు ఏమిటి అన్నది ప్రశ్నార్థకంగా మారిందని చెప్పుకోవచ్చు.!



తెలంగాణ ప్రభుత్వము
పట్టాదారు పాసు పుస్తకం
భూమి యాజమాన్య హక్కు పత్రం

జిల్లా: సిద్దిపేట్ డివిజన్: సిద్దిపేట
మండలం: నంగునూరు గ్రామం: అంకాపూర్

పాస్ బుక్ నెం. : T10170110297

ఖాతా నెం.: 346

1. పట్టాదారు పేరు ఇంటిపేరుతో : రుక్కమ్మ
2. తండ్రి / భర్త పేరు : మల్లా రెడ్డి
3. స్త్రీ / పురుషుడు : Female
4. చిరునామా : అంకాపూర్
5. కులము : General
6. ఆధార్ సంఖ్య : XXXXXXXX0293
7. పట్టాదారు సంతకం ఎడమ / కుడి చేతి వేలిముద్ర

01

తహశీల్దార్ సంతకం

### అసలు వివాదం ఏంటి?

కొంతకాలంగా కొందరు వ్యక్తులు ఆమె భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ, ఆమె వేయించిన సిమెంట్ ఫెన్సింగ్ స్తంభాలను కూల్చివేసి, గుంతలు తవ్వి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని బాధితురాలు ఆరోపిస్తోంది.

### 7 నెలలుగా పెండింగ్ లోనే ఫైలు - రావాల్సిన అధికారి రాలేదు!

తన భూమికి శాశ్వత పరిష్కారం చూపాలని బాధితురాలు 2026 ఫిబ్రవరి నెలలోనే AD సర్వే & ల్యాండ్ రికార్డ్స్ విభాగానికి దరఖాస్తు చేసుకుని, చలానా / డీడీ రూపంలో ఫీజు చెల్లించింది. ఫైల్ నెం. A3/19/2026 గా నమోదైంది.

నిబంధనల ప్రకారం ఉన్నతాధికారి స్వయంగా రావాలి. కానీ బాధితురాలి తాజా ఆరోపణ ప్రకారం, ఫిర్యాదు చేసి డీడీ కట్టినా రావాల్సిన సర్వే ఉన్నతాధికారి రాకుండా తన అసిస్టెంట్లను పంపించారు.

### అత్యంత కీలక ఆరోపణ - తప్పుడు నివేదికతో కబ్జాదారులకు వత్తాసు?

అక్కడికొచ్చిన అసిస్టెంట్లు క్షేత్రస్థాయి వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా తప్పుడు నివేదిక సమర్పించారని, దీంతో బాధితురాలికి న్యాయం జరగాల్సిన చోట, యథేచ్ఛగా కబ్జాదారులకు అనుకూలంగా ఫెన్సింగ్ వేసి "ఇదే వారి హద్దు" అని నిర్ణయించారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది.ఈ ఒక్క అంశంతోనే అధికారుల పనితీరు ఏమిటో, వారికి ఎవరి మద్దతు ఉందో క్లియర్ గా అర్థమవుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. పట్టా ఉన్న అర్హురాలికి కాకుండా కబ్జాదారులకు ఫెన్సింగ్ వేసి సహకరించడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్న ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది.

### బాధితురాలి ఆవేదన:

"పట్టా నా పేరిట ఉంది. ఫీజు కట్టాను. ఫెన్సింగ్ కూల్చేస్తుంటే అధికారులకు చెప్పుకున్నా. ఉన్నతాధికారులు వస్తారని ఎదురుచూసి ఎదురుచూసి అలసిపోయా. వారు రాకుండా అసిస్టెంట్లను పంపితే మాకు న్యాయం ఎలా జరుగుతుంది? కలెక్టర్ గారే మాకు న్యాయం చేయాలి."

చివరకు కలెక్టర్ ను ఆశ్రయించిన బాధితురాలు..స్థానిక స్థాయిలో న్యాయం జరగకపోవడంతో బాధితురాలు 08-09-2026 తేదీన సిద్దిపేట జిల్లా కలెక్టర్ గారికి లిఖితపూర్వకంగా వినతి పత్రం అందజేసింది. తన పట్టా భూమికి తిరిగి రీ-సర్వే (Re-examination) నిర్వహించి, ఉన్నతాధికారులతో స్వయంగా కొలతలు వేయించి, తనకు న్యాయం చేయాలని, తన భూమికి రక్షణ కల్పించాలని ఆమె వేడుకుంది.

# నీటి లీకేజీ కారణంగా ఇబ్బందులు

## పరిష్కారం కోసం అధికారులకి రామప్రభు వినతి..

**మియాపూర్, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** గత కొన్ని రోజులుగా మియాపూర్ బొల్లారం చౌరస్తా వద్ద గల అంగరా రెస్టారెంట్ ముందు వాటర్ లీకేజీ కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గమనించి గురువారం రోజు ఉదయం అట్టేపల్లి రామప్రభు స్వయంగా సమస్య ఉన్నప్రాంతాన్నిసందర్శించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యను పరిశీలించిన అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ 3, 4 రోజుల్లో వాటర్ లీకేజీ సమస్యను పూర్తిగా క్లియర్ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్య లు కనిపిస్తే చాలు పరిష్కారం కోసం ముందుండే నాయకుడు రామప్రభు అని పలువురు ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రశంసలు కురిపిస్తున్నారు.



## వీరనారి చాకలి ఐలమ్మ గారి 41 వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్



**మన్సూరాబాద్, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చింతలకుంటలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అ ర్పించారు. మ న్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన సురేష్ యాదవ్, ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ గారి త్యాగాలను స్మరించుకుంటూ, భూమి కోసం, భుక్తి కోసం, పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని నాయకులు పేర్కొన్నారు. ఆమె ధైర్యం, తెగువ, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పృథ్వీ చౌదరి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుద్ధ సత్యనారాయణ, పాశం అశోక్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కాదరి బాలకృష్ణ యాదవ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చెల్లా రమేష్, కొప్పుల వెంకట్ రెడ్డి, ఎర్ర శేఖర్ గౌడ్, కన్నబాబు, తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

# దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

- స్తంభించనున్న ఆర్థిక లావాదేవీలు..
- మద్దతు తెలిపిన ఉద్యోగ సంఘాలు




**పినపాక , సెప్టెంబర్10, నేటి శుభోదయ :** దేశ వ్యాప్తంగా శుక్రవారం రోజున ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు భారీ సమ్మెకు పిలుపునిచ్చారు. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ , ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్, సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ఆందోళన కార్యక్రమంతో దేశవ్యాప్తంగా అన్ని బ్యాంకింగ్ సేవలకు, నగదు లావాదేవీలకు తీవ్ర అంతరాయం కలగనుంది.బ్యాంకింగ్ రంగంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసమే ఈ సమ్మె చేపడుతున్నట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. అందులో ముఖ్యంగా బ్యాంకు ఉద్యోగులకు వారానికి 5 రోజుల పనిదినాల విధానాన్ని తక్షణమే అమలు చేయాలి. బ్యాంకింగ్ శాఖల్లో ఏళ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలి. నేషనల్ పెన్షన్ సిస్టమ్‌ను రద్దు చేసి, లబ్ధి చేకూర్చే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి. ప్రజారోగ్య, ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రైవేట్ పరంచేసే చర్యలను వెంటనే నిలిపివేయాలి.కేంద్ర ప్రభుత్వం బ్యాంకింగ్ యాజమాన్యాలు తమ న్యాయమైన డిమాండ్లపై సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ సమ్మెకు స్పందించని పక్షంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో వరుసగా మూడు రోజుల పాటు దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తామని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి. బ్యాంకులు మూతపడనుండటంతో వినియోగదారులు డిజిటల్ లావాదేవీలు, ఏటీఎం సేవలపై ఆధారపడాల్సి రానుంది.

# దళితుల ఆత్మగౌరవాన్ని అవమానిస్తే సహించం: అనుమగల్ల రమేష్



**కేశంపేట, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** దళితులు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లిన అనంతరం వారు నడిచిన ప్రాంతాన్ని పసుపు నీళ్లతో శుద్ధి చేయించారని ఆరోపిస్తూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేశంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అనుమగల్ల రమేష్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ ఘటన దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఉందని, అంటరానితన భావజాలాన్ని ప్రోత్సహించే చర్యలను సహించేది లేదన్నారు.షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ దళితులు కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్దకు వెళ్లారని తెలిపారు. దళితులు నడిచిన ప్రాంతాన్ని శుద్ధి చేయించడం అవమానకరమని, ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచిన కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ యావత్ దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని రమేష్ కోరారు. దళిత ముఖ్యమంత్రి, మూడు ఎకరాల భూమి, దళిత బంధు వంటి హామీలతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం దళితులను మోసం చేసిందని విమర్శించారు. సమావేశంలో జాంగారి రవి, జనిగే జగన్, సింగపగా అనిల్‌కుమార్, జాంగారి జంగయ్య, కరోళ్ల యాదయ్య, కొత్తపేట సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## కాజీపేట బస్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



**హన్మకొండ, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** కాజీపేటలో శాశ్వత ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదిత రైల్వే స్థలాల ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం పరిశీలించారు. రైల్వే స్టేషన్ ముందు ఉన్న స్థలం, రైల్వే పాఠశాల, స్టేడియం ప్రాంతం, స్టేడియానికి ఎదురుగా ఉన్న సుమారు ఎకరం భూమిని అధికారు లతో కలిసి పరిశీలించారు.శాశ్వత బస్‌స్టేషన్ నిర్మా ణానికి అవసరమైన భూమి సమకూర్చుకో వడం, రైల్వే శాఖతో భూమి మార్పిడి ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటా మని తెలిపారు. కార్యక్ర మంలో ఆర్టీసీ ఆర్‌ఎం భవానీ ప్రసాద్, డిప్యూటీ ఆర్‌ఎం కిషన్‌రావు, డీఎం ధరమ్‌సింగ్, రైల్వే అధి కారులు తదితరులు పాల్గొ న్నారు.

## ఎస్ఐఆర్ క్లెయిమ్స్, అభ్యంతరాల గడువు పెంపు

### - అదనపు కలెక్టర్ ఎన్.రవి



**హన్మకొండ, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** ఎస్ఐఆర్ ప్రక్రియలో క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకర ణ గడువును అక్టోబర్ 7 వరకు, వాటి విచారణ గడువును నవంబర్ 5 వరకు ఎన్నికల సంఘం పొడిగించినట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి తెలిపారు. తుది ఓటర్ల జాబితా నవం బర్ 9న విడుదల కానుం దని పేర్కొన్నారు. గురు వారం కలెక్టరేట్‌లో రాజ కీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం లో ఎస్ఐఆర్ ప్రక్రియపై వివరాలు వెల్లడించారు. నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలో ఉండి నోటీ సులు అందుకున్న ఓటర్లు నోటీసులో పేర్కొన్న తేదీ, ప్రదేశంలో విచారణకు హాజరై ఈసీఐ సూచించిన ధ్రువపత్రాలను సమర్పిం చాలని సూచించారు.పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో నో మ్యాపింగ్, అనామలీస్ జాబితాలోని 1,32,070 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా, ఇప్పటి వరకు 39,996 మందికి విచారణ పూర్తయిందని తెలిపారు. మిగిలిన వారికి కూడా నోటీసుల ప్రకారం విచారణకు హాజరై అవ సరమైన పత్రాలు సమర్పిం చాలని అదనపు కలెక్టర్ కోరారు.

## పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

### - జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



**హన్మకొండ, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** జిల్లాలో పరిశ్రమల స్థాపన కు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. గురువా రం కుడా కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో DIPC, TG-iPASS కమిటీ సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అనుమతులు,TG-iPASS దరఖాస్తులను సమీక్షించి అర్హత కలిగిన యూనిట్లకు ఆమోదం తెలిపారు. T- PRIDE కింద ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సరకు రవాణా వాహనాలపై ప్రోత్సాహకాల దరఖాస్తు లను పరిశీలించి, నిబంధనల మేరకు ఉన్న వాటికి ప్రోత్సాహకాలు మంజూరు చేశారు. సంబంధిత శాఖ లు అనుమతులను త్వరి తగతిన జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# సైక్లింగ్ ట్రాక్‌తో ట్రాఫిక్ తిప్పలు

### మెట్టుగూడ - తార్నాక సీసీఎంబీ వరకు రోడ్డుకు ఇరువైపులా తొలగించాలంటున్న వాహనదారులు

### సాయంత్రం వేళ నరకప్రాయంగా మారుతున్న రాకపోకలు..

### ట్రాక్‌ను అడ్డుపెట్టుకుని వ్యాపారుల ఆక్రమణలు





**హైదరాబాద్, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** నగరంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు, కొన్ని ప్రాంతాల్లో తీసుకుంటున్న నిర్ణయాలు వాహనదారులకు మరింత ఇబ్బందిగా మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెట్టుగూడ నుంచి తార్నాక సీసీఎంబీ వరకు ఏర్పాటు చేసిన సైక్లింగ్ ట్రాక్ ప్రస్తుతం వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ పెరిగినప్పుడు రోడ్డు చాలక ట్రాఫిక్ నెమ్మదించడంతో పాటు వాహనదారులు ట్రాక్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొంటున్నారు.

**రోడ్డు చాలక.. ట్రాక్‌లోకి వాహనాలు**

మెట్టుగూడ నుంచి తార్నాక మీదుగా సీసీఎంబీ వరకు ప్రధాన రహదారిపై రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోంది. ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో వాహనాలు బారులు తీరుతున్నాయి. రహదారి అందుబాటులో ఉన్న స్థలం తగ్గిపోవడంతో కొందరు వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో సైక్లింగ్ ట్రాక్‌లోకి వెళ్లాల్సి వస్తోందని వాహనాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సైక్లిస్టులకు ఉద్దేశించిన ట్రాక్ సైకిల్ నడచేవారు లేక రోడ్డుతో ప్రయోజనం లేకుండా పోతోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**ట్రాక్‌కు అడ్డుగా వ్యాపారుల ఆక్రమణలు**

మరోవైపు సైక్లింగ్ ట్రాక్‌ను అడ్డుపెట్టుకుని కొందరు వ్యాపారులు తమ కార్యకలాపాలను విస్తరించుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాక్ పరిసరాల్లో వాహనాల నిలిపివేత, వ్యాపార సామగ్రి ఏర్పాటు తదితర కారణాలతో వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ట్రాక్ లక్ష్యం సైక్లిస్టులకు సురక్షిత మార్గం కల్పించడమే అయినప్పటికీ సైకిల్ నడిపేవారు లేకపోవడంతో ట్రాఫిక్‌కు అదనపు ఇబ్బందిగా మారిందని వాహనాదారులు పేర్కొంటున్నారు.

**హబ్సిగూడ—ఉప్పల్‌లో తొలగించడంతో ట్రాఫిక్ కష్టాలు తగ్గాయి**

హబ్సిగూడ చౌరస్తా నుంచి ఉప్పల్ వరకు సైక్లింగ్ ట్రాక్‌తో ఎలాంటి ఉపయోగం లేకపోగా వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుందని ఎం ఎం సి కమిషనర్ పరిశీలించి తొలగించడంతో ట్రాఫిక్ సమస్య కొంతమేర తగ్గిందని వాహనదారులు గుర్తుచేస్తున్నారు. అదే తరహాలో మెట్టుగూడ నుంచి తార్నాక సీసీఎంబీ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న సైక్లింగ్ ట్రాక్‌ను తొలగించి రహదారి వెడల్పును పెంచాలని కోరుతున్నారు.

**జోనల్ కమిషనర్ స్పందించాలి**

సికింద్రాబాద్ జోన్ జోనల్ కమిషనర్ ఈ అంశంపై వెంటనే దృష్టి సారించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, ట్రాక్ వల్ల ట్రాఫిక్‌కు అవరోధంగా మారిందా.? అనే విషయాన్ని పరిశీలించి అవసరమైతే వెంటనే ట్రాక్‌ను తొలగించి రహదారి వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని సూచిస్తున్నారు. హైదరాబాదులో ట్రాఫిక్ కష్టాలతో ప్రతిరోజూ అవస్థలు పడుతున్న వాహనదారుల విజ్ఞప్తిపై జిహెచ్ఎంసి ఉన్నత అధికారులు ఇకనైనా స్పందిస్తారా.? లేక ట్రాఫిక్ జామ్‌లను చూస్తూ మౌనం వహిస్తారా అనేది వేచి చూడాలి.

## కొండల్ రెడ్డి కంపెనీకి అక్రమంగా కట్టబెట్టిన భూమిని పరిశీలించిన కేటీఆర్, హరీష్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం

### రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి భారీగా తరలి వెళ్లిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అప్రజస్వామికంగా సస్పెండ్ చేయడంతో ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావు,సబిత ఇంద్రారెడ్డి,ఇతర ఎమ్మెల్యేల బృందం సిద్ధమైంది..ప్రత్యేక సమావేశం అయిన అనంతరం గురువారం కేటీఆర్ తో పాటు ఎమ్మెల్యేల బృందం రంగారెడ్డి జిల్లాలోని కొంగర,ర్యావిరాలకు సీఎం రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి కంపెనీకి ఫోర్త్ సిటీలో అక్రమంగా కట్టబెట్టిన భూమిని పరిశీలించారు.కేటీఆర్ పిలుపుతో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.కాంగ్రెస్ ప్రభుత్వం కొండల్ రెడ్డి కంపెనీ టెసెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు రూ.200కోట్ల విలువైన భూమిని కేవలం రూ.7కోట్లకు కట్టబెట్టింది.కాగా,కేవలం రూ.లక్షతో మొదలైన టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి రూ.200 కోట్ల విలువైన 5ఎకరాల భూమిని కేటాయించి రేవంత్ రెడ్డి అతిపెద్ద కుంభకోణానికి పాల్పడ్డాడని కేటీఆర్ ఆరోపించారు.టెస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి నేను చైర్మన్‌గా ఉన్నానని రేవంత్ రెడ్డి



సోదరుడు కొండల్ రెడ్డి లింక్‌ఇన్ బయోలో పెట్టుకున్నాడు.రేవంత్ రెడ్డి సోదరులందరికీ పొట్ట కోస్తే అక్షరం ముక్క రాదు వీళ్ళందరూ ఉన్నట్లుండి కోట్లు బూట్లు వేసుకొని పెద్ద పెద్ద కంపెనీలకు చైర్మన్లు ఎలా అయ్యారు అని ప్రశ్నించారు.తరలివెళ్లిన వారిలో రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు పోరెడ్డి ధర్మారెడ్డి,రాజేంద్రనగర్,శంషాబాద్ నాయకులు ఎస్ వెంకటేశ్,కొన్నమొల శ్రీనివాస్, శీలం తిరుపతిరెడ్డి,మహమ్మద్ జహీరుద్దీన్,దేవదాస్ పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలపై అవగాహనకు 1000 కరపత్రాల పంపిణీ

**హన్మకొండ, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించా లని సుజాత విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ ఆకు తోట శాంతారాం కర్ణ పిలు పునిచ్చారు. 66వ డివిజన్ పరిధిలోని పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల ఆవశ్యకతపై రూపొందించి న 1,000 కరపత్రాలను గురువారం ఆవిష్కరించి విద్యార్థులకు, ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా శాంతారాం కర్ణ మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను చెరు వుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై జలచరాలు, పశుపక్షాదుల కు నష్టం కలుగుతుందని తెలిపారు. ప్రకృతి సహజ సిద్ధమైన మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాల ను పూజించా లని సూచిం చారు. పాఠశాల పర్యావర ణ మిత్ర యూనిట్ ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా ప్రతి సంవత్సరం సుమారు 1,500 మట్టి వినాయక విగ్రహాలను విద్యార్థులతో తయారు చేయించి ఉచి తంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరి రక్షణ కార్యక్రమాలకు




ఇప్ప టికే జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఆరు పర్యావరణ మిత్ర అవార్డులు అందుకు న్నట్లు తెలిపారు. విద్యార్థు ల్లో పర్యావరణంపై చిన్న నాటి నుంచే అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు పేర్కొన్నారు. కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీనారాయ ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హైకోర్టు ఆదేశాలకే టౌన్ ప్లానింగ్ అధికారుల తిలోదకాలు

- రిట్ పిటిషన్లు ఉన్నా నిర్మాణ పనులు యథేచ్ఛగా.. పూర్తిచేసి ప్రారంభిస్తున్నా పట్టించుకోని అధికారులు
- అక్రమ నిర్మాణాలపై ప్రజల ఫిర్యాదులు బుట్టదాఖలు..
- కోర్టు పరిధిలోని నిర్మాణాలపైనా మౌనం ఎందుకు.?
- అమీర్‌పేట సర్కిల్‌లో డీసీ, ఏసీపీ, సెక్షన్ అధికారుల బాధ్యతారాహిత్యంపై చర్యలు ఎప్పుడు.?





**హైదరాబాద్, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** గ్రేటర్ హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు తమ బాధ్యతలను విస్మరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడం ఒక ఎత్తయితే.. అక్రమ నిర్మాణాలపై న్యాయస్థానాల్లో రిట్ పిటిషన్లు కొనసాగుతున్నప్పటికీ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతుండటం, నిర్మాణాలు పూర్తి చేసుకొని అక్రమ నిర్మాణాలు వినియోగంలోకి రావడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కోర్టు పరిధిలో ఉన్న నిర్మాణాలను పూర్తి చేసి, ప్రారంభించినా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.అమీర్‌పేట పరిధిలోని బికేగూడ ప్రాంతంలో ప్లాట్ నెంబర్.7-1-401/ఎ/8, సర్వే నంబర్.64/ఎ , నిర్మాణానికి సంబంధించి వివాదం నెలకొన్న నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారుల వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై న్యాయపరమైన చర్యలు, రిట్ పిటిషన్లు వంటి అంశాలు ఉన్నప్పుడు అమీర్ పేట సర్కిల్ అధికారులు నిబంధనల ప్రకారం వ్యవహరించాల్సి ఉంటుంది. అయితే నిర్మాణ పనులు జరుగుతున్న వాటిని అడ్డుకోవడంలో టౌన్ ప్లానింగ్ ఏసీపి, సెక్షన్ ఆఫీసర్ అధికారులు ఎందుకు విఫలమయ్యారన్నది సమాధానం చెప్పాలని స్థానికులు పేర్కొంటున్నారు.జిహెచ్ఎంసి అనుమతి నిబంధనల ప్రకారం మంజూరైన ప్లాన్‌కు అనుగుణంగానే నిర్మాణం చేపట్టాలి. ఉల్లంఘనలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అనుమతి లేకుండా లేదా మంజూరైన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టే వారిపై చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

### ఫిర్యాదులకు విలువ లేదా?

ప్రజలు ఫిర్యాదులు చేస్తే వాటిని పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. కానీ ఫిర్యాదులు పట్టించుకోకుండా నిర్మాణాలు ముందుకు సాగితే.. అధికారుల పర్యవేక్షణ ఎక్కడ.? తనిఖీలు ఎక్కడ.? చర్యలు ఎక్కడ.? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అమీర్పేటలో జరుగుతున్న భారీ అక్రమ నిర్మాణానికి అక్రమ సెల్లా అక్రమ అంతస్తులు ఉన్నాయని అధికారులకు ఫిర్యాదులు వచ్చిన మామూళ్లు తీసుకొని వదిలేసారని ఆరోపణలు ఉన్నాయి.
జిహెచ్ఎంసిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో డీసీ, ఏసీపీ తదితర అధికారులకు బాధ్యతలు ఉన్నట్లు ఉన్న కనీస చర్యలు లేవని ప్రజలు మండిపడుతున్నారు.

### కోర్టు ఆదేశాలకే విలువ లేకపోతే.?

ప్రజల ఫిర్యాదులను పట్టించుకోకపోవడం ఒక సమస్య అయితే.. న్యాయస్థానాల పరిధిలో ఉన్న అంశాల్లో కూడా అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడం మరింత తీవ్రమైన విషయం. కోర్టు ఆదేశాలను ఎవరు ఉల్లంఘించినా చట్టపరమైన పరిణామాలు తప్పవు. అలాంటి పరిస్థితి రాకముందే అధికారులు వాస్తవాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హైకోర్టు ఆదేశాలనే టౌన్ ప్లానింగ్ అధికారులు లెక్కచేయకపోతే ఇక సామాన్యుడి ఫిర్యాదుకు విలువ ఎక్కడ.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులే మౌనం వహిస్తే అక్రమ నిర్మాణాలపై నియంత్రణ ఎలా సాధ్యమవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

అమీర్‌పేట సర్కిల్ పరిధిలోని సంబంధిత నిర్మాణంపై డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, సెక్షన్ అధికారుల స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదులు అందిన తేదీలు, అధికారులు చేసిన తనిఖీలు, జారీ చేసిన నోటీసులు, తీసుకున్న చర్యలు, కోర్టు వ్యవహారం వంటి అంశాలపై రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల అక్రమ నిర్మాణాలు పూర్తయ్యే పరిస్థితి వస్తే.. తర్వాత వాటిపై చర్యలు తీసుకోవడం మరింత క్లిష్టంగా మారుతుంది. అందుకే నిర్మాణం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు తేలితే తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని లేనిపక్షంలో సర్కిల్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ ఎసిపి సెక్షన్ ఆఫీసర్లపై చట్టపరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణ సచివాలయంలో ఏసీబీ దాడులు

## - రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుకు రూ.లక్ష లంచం

**హైదరాబాద్, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** తెలంగాణ సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన ట్రాప్ కలకలం రేపింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.2 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెక్కును ఇప్పించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు అందిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. సచివాలయ ఆవరణలోని దేవాలయం సమీపంలో లంచం తీసుకుంటుండగా ఓ ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ లంచం తీసుకోవడంలో మరో ఉద్యోగి హస్తం కూడా ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వారిద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నారు.సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కు కోసం బాధితుడు సంబంధిత ఉద్యోగులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో చెక్కును అందించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సచివాలయ ఆవరణలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఉద్యోగిని అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో సచివాలయంలోని సీఎంఆర్ఎఫ్ విభాగానికి సంబంధించిన సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మొదటి విడతగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర రూ.5 వేల నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మిగిలిన మొత్తంలో భాగంగా రూ.లక్ష తీసుకునే సమయంలో సీనియర్ అసిస్టెంట్/సెక్షన్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి ఏసీబీ ట్రాప్‌లో చిక్కినట్లు తెలుస్తోంది. ఈ లంచం వ్యవహారంలో ఎవరి ఆదేశాల మేరకు డబ్బులు డిమాండ్ చేశారు, ఇంకా ఎవరైనా ఉద్యోగులు, అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారా అనే కోణాల్లో ఏసీబీ అధికారులు దర్యాప్తు



చేస్తున్నట్లు సమాచారం.ట్రాప్ తర్వాత ఏసీబీ అధికారులు సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన విభాగంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాధితుడి దరఖాస్తు, సీఎంఆర్ఎఫ్ మంజూరు ప్రక్రియ, చెక్కు విడుదలకు సంబంధించిన ఫైళ్లు, ఉద్యోగుల పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్ వెనుక మరెవరైనా రెగ్యులర్ అధికారులు ఉన్నారా అనే అంశంపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాప్‌లో పట్టుబడిన ఇద్దరు ఉద్యోగులను నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, డబ్బుల లావాదేవీలు, సీఎంఆర్ఎఫ్ ఫైల్ ప్రాసెసింగ్‌లో వారి పాత్ర వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన కార్యాలయమైన సచివాలయంలోనే సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం తీసుకుంటూ ఉద్యోగులు పట్టుబడినట్లు వార్తలు రావడం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన ప్రక్రియలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

# నకిలీ ప్లెడ్జ్ పత్రాలతో రూ.59.30 లక్షల మోసం

## ఇద్దరు నిందితుల అరెస్ట్: ఇన్‌స్పెక్టర్ మచ్చ శివ కుమార్




**హన్మకొండ, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** నకిలీ బంగారం తాకట్టు పత్రాలు సృష్టించి గోల్డ్ ఫైనాన్స్ సంస్థను రూ.59.30 లక్షలకు మోసం చేసిన కేసులో ఇద్దరు నిందితుల ను హనుమకొండ పోలీసు లు అరెస్ట్ చేశారు. ఎలిమి సంతోష్ (37), శ్రీమాన్ కో– ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ చైర్మన్ కమ్ సీఈఓ, వడ్డేపల్లి రంజిత్ (39), వ్యాపారిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మచ్చ శివ కుమార్ తెలిపారు.ఇద్దరూ కలిసి రంజిత్‌కు చెందిన సుమారు 640 గ్రాముల బంగారం శ్రీమాన్ యూనియన్‌లో తాకట్టు ఉన్నట్లు నకిలీ ప్లెడ్జ్ రసీదు సృష్టిం చారు. దానిని నమ్మిన గోల్డ్ ఫైనాన్స్ సంస్థ ప్రతినిధి బంగారాన్ని ప్రత్యక్షంగా పరిశీలించకుండానే రూ. 59.30 లక్షలను యూనియన్ ఖాతాకు ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు.కేసులో నిందితుల మొబై ల్ ఫోన్లు, నకిలీ ప్లెడ్జ్ పత్రా న్ని స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. ఈ వ్యవ హారంలో మరెవరైనా ఉన్నారా, ఇదే తరహాలో ఇతర సంస్థలను మోసం చేశారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. బంగారం తాకట్టు విషయం లో ప్రత్యక్షంగా ధృవీకరిం చిన తర్వాతే ఆర్థిక లావా దేవీలు జరపాలని పోలీ సులు సూచించారు.

# ఖమ్మం జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలకు ఆట వస్తువుల సరఫరాకు షార్ట్ టెండర్ ఆహ్వానం

## - అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లాలోని మొత్తం 28 పీఎం శ్రీ పాఠశాలలకు ఆట వస్తువులు సరఫరా చేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి షార్ట్ టెండర్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 28 పాఠశాలలకు గాను మొత్తం 167 రకాల ఆట వస్తువులను సరఫరా చేయాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ అన్నారు. ప్రతి పాఠశాలకు రూ. 50 వేల చొప్పున మొత్తం రూ. 14 లక్షలు ఇందుకు కేటాయించినట్లు తెలిపారు. ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొనదలచిన అభ్యర్థులు ఖమ్మం జిల్లాకు చెందినవారై ఉండాలన్నారు.దరఖాస్తు అండ్ షెడ్యూల్ రుసుము రూ. 4 వేలు వుంటుందని, ధరావతు సొమ్ము రూ. 50 వేలు డిమాండ్ డ్రాఫ్ట్ జిల్లా కలెక్టరు, ఛైర్మన్, సమగ్ర శిక్ష, ఖమ్మం పేరున తీయాలని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, కలెక్టరేట్, ఖమ్మం నందు ఈ నెల 15 నుండి నుండి ఈ నెల 17 వ తేదీ సాయంత్రం 05:00 గంటల వరకు మాత్రమే సీల్డ్ టెండర్ దరఖాస్తులు స్వీకరించబడతాయని, నిర్ణీత గడువు దాటిన తర్వాత లేదా తపాలా ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించరని అదనపు కలెక్టర్ తెలిపారు.టెండర్లను ఈ నెల 19 న ఉదయం 11:00 గంటలకు అదనపు కలెక్టర్ మరియు జిల్లా కొనుగోలు కమిటీ ఛైర్మన్ సమక్షంలో టెండర్లు తెరవబడతాయని, టెండర్ గడువును పొడిగించేందుకు లేదా రద్దు పరిచేందుకు అదనపు కలెక్టర్ మరియు జిల్లా కొనుగోలు కమిటీ ఛైర్మన్ గారికి సంపూర్ణ అధికారం కలదని అదనపు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# సిపిఐ(యం) జిలా కార్యాలయంలో ఘనంగా చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి సభ

## - కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు



**ఖమ్మం, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** సిపిఐ (యం) జిల్లా కార్యాలయంలో గురువారం రోజున జరిగిన వీరనారి చిట్యాల ఐలమ్మ 41 వ వర్ధంతి సభ సిపిఐ (యం) జిల్లా ఆఫీస్ కార్యదర్శి ఆర్. ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభ లో సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరావు పాల్గొని ఐలమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ రజక సామాజిక వర్గానికి చెందినందున చాకలి ఐలమ్మ గా పేరొచ్చిందని, ఆనాడు విసునూరు దొరల అహంకారానికీ, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన ధీరవనితగా, రజాకారుల, దొరల నిరంకుశ పాలన, భూస్వాముల దోపిడికు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి అని కొనియాడారు. ఆనాడు నిజం నిరంకుశ పాలన దొరల వెట్టిచాకిరికు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభల్లో పాల్గొని అనేక ఉద్యమాల్లో, పోరాటాల్లో పాల్గొని దొరల నుండి వెట్టిచాకిరి విముక్తికు దున్నే వాడిదే భూమి అనే నినాదంలో తెలంగాణ రైతాంగ పోరాటాలకు ముందుండి నాయకత్వం వహించిందని చిట్యాల ఐలమ్మ చేసిన పోరాటం ఏ ఒక వర్గానికో కులానికో సంబంధించినది కాదన్నారు. కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థలైన ఆర్.ఎస్.ఎస్ లు తెలంగాణ రాష్ట్రంలో అధికారం పొందడానికి తెలంగాణ రైతాంగ పోరాటాన్ని హిందూ ముస్లింల వ్యతిరేక పోరాటంగా చిత్రీకరించి హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించి రాజకీయంగా హిందువుల ఓట్లను లబ్ది పొందేందుకు ప్రయత్నిస్తుంన్నాయని ఇటువంటి కుట్రలను తిప్పికొట్టుతూ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం వుందన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంతో సుమారు 10 లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో భూమిలేని అన్ని సామాజిక వర్గాలకు పంచి పెట్టిన ఘనత కమ్యూనిస్టులదే అన్నారు. ఆనాడు దొరల నుండి భూములను రైతులకు పంచుతే ఈ రోజు మళ్ళి ఫ్యూడల్ వ్యవస్థను తీసుకు వచ్చి కేంద్ర ప్రభుత్వానికి అనుకూలమైన బడా కార్పొరేట్లకు లక్షల ఎకరాలు కట్ట బెడ్తుందని, ఏ భూస్వామ్య దొరల వ్యవస్థకు చిట్యాల ఐలమ్మ పోరాడిందో తిరిగి అదే భూస్వామ్య వ్యవస్థలో భాగమైన కార్పొరేట్ సంస్థలకు భూములను ధారదత్తం చేస్తున్న ప్రభుత్వాల పై మళ్ళి ఉద్యమిం చాలిసిన అవసరం వుందని అన్నారు. చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో రానున్న రోజుల్లో ఆమె ఆశయాలను ఇంకా ముందుకు కొనసాగించటమే మనము ఆమె ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, మాదినేని రమేష్, యర్రా శ్రీనివాస్ రావు, మెరుగు సత్యనారాయణ , జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నవీన్ రెడ్డి, మెరుగు రమణ, పిన్నింటి రమ్య, జిల్లా నాయకులు బోడపట్ల సుదర్శన్, పగడాల నాగేశ్వరరావు, జి. శ్రీదేవి, నాగ సులోచన,బొడ్డు మధు, భాగం అజిత, బేగం, జిల్లా ఉపేందర్, వీరారెడ్డి, పుల్లారావు, ఈ వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తితదితరులు పాల్గొన్నారు.

# జీవితం అమూల్యమైనది




**ఖమ్మం, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** జీవితం అమూల్యమైనదని, భావోద్వేగాల నియంత్రణే ఆత్మ హత్యల నివారణకు మార్గమని ఖమ్మం జిల్లా మెంటల్ హెల్త్ ఆఫీసర్ డా.సొహైల్ విద్యార్థులకు సూచించారు.గురువారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ ప్రభుత్వ కళాశాల మెంటల్ హెల్త్ అవేర్నెస్ క్లబ్ –భాగ్య హెల్త్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలోవైస్ ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సు లో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని విద్యార్థులకు ఆత్మహత్యల నివారణ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన చైతన్యాన్ని కల్పించారు. అనుకోని సంఘటనలు ఎదురైనప్పుడు సానుకూల ఆలోచనలతో వ్యవహరించాలని తెలిపారు.యోగ, ధ్యానం,సమతుల్య ఆహారపు అలవాట్లు,మంచి నిద్ర కుటుంబ సభ్యులు, మిత్రులు, అధ్యాపకులతో మాట్లాడం వలన ప్రతికూల ఆలోచనలు నుంచి బయటపడవచ్చని సూచించారు ఒత్తిడి జయించడం ద్వారా అధ్భుతమైన జీవితాన్ని నిర్మించుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణాదేవి, ఐ.క్యూఏసికోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సునంద, భాగ్య హెల్త్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.కవిత, మెడికల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రానికి డిజిటల్ టీవీ



**ఖమ్మం, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా ఎన్నారై ఫౌండేషన్ ఆధ్వర్యంలో 11వ డివిజన్ కవిరాజ్ నగర్ రోడ్ నెం.12లోని అంగన్వాడీ సెంటర్–2కు డిజిటల్ టీవీని అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షులు బయన్న బాబు అందించిన టీవీని మాజీ కార్పొరేటర్ సరిపూడి రమాదేవి ప్రారంభించారు. టీవీకి అవసరమైన మెటీరియల్, వైఫై సదుపాయాన్ని కొనిదెన శ్రీనివాసరావు సొంత నిధులతో సమకూర్చారు.విద్యా వీడియోలు, విజ్ఞాన కార్యక్రమాల ద్వారా చిన్నారులకు బోధనను మరింత ఆసక్తికరంగా అందించేందుకు డిజిటల్ టీవీ ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర పద్మజారెడ్డి, అంగన్వాడీ టీచర్ నాగమణి, కొల్లి మాధవి, సరిపూడి వెంకటేశ్వర్లు, అంగన్వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వీర వనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకం

**- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జ్యోతి**



**ఖమ్మం, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** వీర వనిత చాకలి ఐలమ్మ ప్రదర్శించిన పోరాట స్ఫూర్తి స్ఫూర్తిదాయకమని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి అన్నారు. స్థానిక వైరా రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల ఎదురుగా ఉన్న వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద గురువారం జిల్లా వెనక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి పాల్గొని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి మాట్లాడుతూ సమాజంలోని అసమానత్వానికి ఎదురొడ్డి నిర్భయంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, జమీందార్ల పాలనలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా అనేక సంఘాలలో ఆమె స్ఫూర్తి నింపారని అన్నారు. చాకలి ఐలమ్మ సంఘ సేవకురాలిగా, భూ, సాయుధ రైతాంగ పోరాటంలో ప్రదర్శించిన పోరాట పటిమతో వీర వనితగా చరిత్రలో నిలిచి, ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు.సమాజహితం కొరకు పోరాడిన మహనీయుల స్ఫూర్తి, వారి త్యాగాలు, గొప్పతనం ప్రజలకు తెలిసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వారి వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తుందని అన్నారు. చాకలి ఐలమ్మ కు గుర్తింపు అందించడంలో భాగంగా కోఠిలోని మహిళ యూనివర్సిటీకి ప్రభుత్వం చాకలి ఐలమ్మ పేరు పెట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ సొసైటీ చైర్మన్ ఎలగొండ స్వామి, రజక కులసంఘ నాయకులు, బిసి కుల సంఘ నాయకులు జక్కుల వెంకటరమణ, తమ్మరపు బ్రహ్మం, మాచర్ల యెలాద్రి, కోడి లింగయ్య, నట్టు వెంకటేశ్వర్లు, కత్తి నెహ్రూగౌడ్, మునిగ కోటేశ్వరరావు, ఎల్లురి విజయ్ కుమార్, ఎస్ కే సయ్యద్ బాషా, వల్లపు సోమరాజు, అప్పారావు, ఉపేందర్, పడిగల కృష్ణవేణి, రమాదేవి, బాబురావు, సత్యనారాయణ, హనుమంతు రావు, వెంకన్న, రమణ కుమార్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారులు, ఖమ్మం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ కార్యాలయం సిబ్బంది, వసతిగృహ సంక్షేమ అధికారులు, రజక సంఘ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా ఖమ్మం ఆర్.టి.ఓ కార్యాలయం

**- ఏజెంట్లతో వెళ్తేనే పనులు   - లేకుంటే కొర్రీలతో కాళ్లరిగేలా తిప్పుకుంటున్న సిబ్బంది**

**ఖమ్మం, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** ప్రజలకు సులభంగా సేవలు అందించాల్సిన చోట, మధ్యవర్తులు (ఏజెంట్లు) ఆధిపత్యం పెరిగిపోవడంతో, నేరుగా వెళ్లే సాధారణ వ్యక్తుల పనులు రోజులు, వారాలు పట్టే పరిస్థితి ఏర్పడింది. నేరుగా వెళ్లిన ప్రజల పనులు నిబంధనల పేరుతో అధికారులు చేయడం లేదు. అదే పని కోసం ఏజెంట్ ద్వారా వెళితే క్షణాలలో అధికారులు సంతకాలు చేస్తున్నారు. ఖమ్మం ఆర్ టి ఓ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు ప్రత్యేక కథనం ఇది..

ఖమ్మం రవాణా శాఖ కార్యాలయంలో సామాన్య ప్రజలకు సేవలు అందడంలో తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆర్ టి ఓ కార్యాలయంలో ప్రతి పనిని ఏజెంట్ల ద్వారా వెళ్తేనే చేస్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజలు అవసరాల నిమిత్తం అక్కడికి రావాల్సి ఉంటుంది.

ఆర్ టి ఓ, ఎంవీఐ, ఏఎంవీఐలతో పాటు పలువురు సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రజలకు సులభంగా సేవలు అందించాల్సిన చోట, మధ్యవర్తులు (ఏజెంట్లు) ఆధిపత్యం పెరిగిపోవడంతో నేరుగా వెళ్లే సాధారణ వ్యక్తుల పనులు రోజులు, వారాలు పట్టే పరిస్థితి ఏర్పడింది. నేరుగా వెళ్లిన ప్రజల పనులు నిబంధనల పేరుతో అధికారులు చేయడం లేదు. అదే పని కోసం ఏజెంట్ ద్వారా వెళితే క్షణాలలో సంతకాలు చేస్తున్నారు.

### ఏజెంట్ల ద్వారా వెళితేనే పనులు

డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ఓనర్‌షిప్ తో పాటు పలు పనుల కోసం కార్యాలయానికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే పనులను ఏజెంట్ల ద్వారా చేయించుకుంటే గంటల్లోనే పూర్తవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

"ఏజెంట్‌కు డబ్బు ఇస్తే ఫైల్ కదులుతుంది, లేదంటే అదే ఫైల్ రోజులు పడుతుంది" అని ఆవేదన వ్యక్తమవుతోంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆన్ లైన్ సేవలు అమలు చేసినా ఆర్ టి ఓ కార్యాలయంలో ఏజెంట్ల ద్వారా పనులు జరుగుతున్నాయి.

కొందరు బ్రోకర్లు దుకాణాలను ఏర్పాటు చేసుకుని ప్రజలను ఆకర్షించడం సాధారణంగా మారింది. కొత్తగా వచ్చే వారిని 'మీ పని వెంటనే చేస్తాం'అంటూ ఒప్పించి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని సమాచారం.
ఈ బ్రోకర్లకు కొందరు సిబ్బంది మద్దతు ఉందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### ఆన్‌లైన్ సేవలు ఉన్నా ప్రయోజనం లేదు

ప్రభుత్వం చాలా సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చినా, టెక్నికల్ సమస్యలు, అవగాహన లోపం కారణంగా ప్రజలు మళ్లీ కార్యాలయానికి రావాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని బ్రోకర్లు అవకాశంగా మార్చుకుని దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఏజెంట్లు అందిన కాడికి దోపిడీ చేస్తున్నారు. ఏజెంట్లకు రవాణా శాఖ అధికారుల ప్రోత్సహం ఉండడంతో అవినీతి పెరిగిపోతుంది.

### ఫీజులు ఒకటి, వసూళ్లు మరొకటి

ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులు ఒకవైపు ఉండగా, ఏజెంట్ల ద్వారా చేయించుకుంటే రెట్టింపు నుంచి మూడు రెట్లు వరకు వసూలు చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

ప్రత్యేకంగా లైసెన్స్, ఫిట్‌నెస్ వంటి పనుల్లో ఈ అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయని సమాచారం. రవాణా శాఖ అధికారులపై అవినీతి ఆరోపణలు వస్తున్నప్పటికీ, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మౌనం వహించడం అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదు. ఆర్ టి ఓ కార్యాలయంలో పర్యవేక్షణ చేయవలసిన ఆ శాఖ ఉన్నాధికారులు వారి మామూళ్ల ను వారు అందుకుంటూ మిన్న కుండి పోతున్నారనే విమర్శలు ఉన్నాయి.
ప్రజలకు సేవ చేయాల్సిన కార్యాలయం అవినీతి కేంద్రంగా మారితే ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటుంది. ఖమ్మం ఆర్ టి ఓ కార్యాలయంలో జరుగుతున్న ఈ అక్రమాలపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, పారదర్శకత తీసుకురావాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

# బీసీ మహిళలకు వంద శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్లు

**దరఖాస్తుల ఆహ్వానం : బిసి అభివృద్ధి అధికారిణి జ్యోతి**

**ఖమ్మం, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** బీసీ మహిళలకు ఉపాధి కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇంటింటా ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం ప్రారంభించి, వందశాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకు నే మహిళలు ఖమ్మం జిల్లాకు చెందిన బీసీ వర్గానికి చెందిన మహిళలై ఉండాలని, 18 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. నిరుద్యోగ మహిళలు, నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనాథ మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు, పట్టణ ప్రాంతాల్లో రూ.2.00 లక్షలకు మించకూడదని, తెల్ల రేషన్ కార్డు/ఫుడ్ సెక్యూరిటీ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.కుట్టు వృత్తిలో నైపుణ్యం కలిగిన వారికి, అలాగే కనీస ప్రాథమిక అక్షరాస్యత ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన బీసీ మహిళలు సెప్టెంబర్ 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులను ★tgob mms. cgg. gov.in పోర్టల్ ద్వారా సమర్పించాలని తెలిపారు. అర్హత కలిగిన బీసీ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా సంబంధిత ధృవీకరణ పత్రాలతో గ్రామీణ ప్రాంతవాసులు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ వాసులు మునిసిపల్ కమీషనర్ లకు దరఖాస్తులు సమర్పించాలని బిసి అభివృద్ధి అధికారి జ్యోతి ఆ ప్రకటనలో కోరారు.

# వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (విబివైఎల్ డి) 2027 క్విజ్ పోటీలు

**ఖమ్మం, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ కేంద్ర ఖమ్మం ద్వారా గురువారం విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. మై భారత్ కేంద్ర ఖమ్మం జిల్లా యువజన అధికారి యం. వెంకట్ రాంబాబు మాట్లాడుతూ భారతదేశంలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ (విబివైఎల్ డి) 2027 ఒక ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి ఆన్లైన్ క్విజ్ పోటీలు 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువత కోసం ఉద్దేశించిన ఈ కార్యక్రమం యొక్క ముఖ్య లక్ష్యం, ప్రతిభావంతులైన యువతీ యువకులను గుర్తించి, 2047 నాటికి దేశాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేయాలనే 'వికసిత్ భారత్' లక్ష్యంలో వారిని భాగస్వాములను చేయడం. తెలుగుతో పాటు దేశంలోని 22 అధికారిక భాషల్లో అందుబాటులో ఉన్న ఈ ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొని, ఐదు దశల ఎంపిక ప్రక్రియ (క్విజ్, వ్యాసరచన పోటీ, జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి రౌండ్లు) ద్వారా తుది విజేతలుగా నిలిచే యువతకు న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి డైలాగ్‌లో పాల్గొని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమక్షంలో దేశాభివృద్ధిపై తమ




సరికొత్త ఆలోచనలను ప్రెజెంట్ చేసే సువర్ణావకాశం లభిస్తుంది ఆసక్తి గల అభ్యర్థులు 30 సెప్టెంబర్ 2026 లోపు (mybharat.gov.in) వెబ్సైట్ లో ఉచితంగా రిజిస్టర్ చేసుకుని పాల్గొనవచ్చు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బనోత్ రెడ్డీ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అకౌంట్స్ ఆఫీసర్ కె. భాను చందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చరిత్ర, జాగృతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ షారుఖ్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమయాన్ని అధికార, ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయి

**ఖమ్మం, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపాల్సిన అసెంబ్లీ సమావేశాల సమయాన్ని అధికార, ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని సీపీఐ నేలకొండపల్లి మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు విమర్శించారు.గురువారం నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై అసెంబ్లీలో నిర్మాణాత్మక చర్చ జరగాల్సి ఉండగా, అధికార–ప్రతిపక్షాలు పరస్పర విమర్శలు, ఆరోపణలకే ప్రాధాన్యత ఇవ్వడం సరికాదన్నారు.నిరుద్యోగం, రైతుల సమస్యలు, నిత్యావసరాల ధరల పెరుగుదల, కార్మికుల ఇబ్బందులు, విద్య, వైద్యం మరియు సంక్షేమ పథకాల అమలు వంటి ప్రజా సమస్యలపై చర్చించి ప్రభుత్వాన్ని జవాబుదారీ చేయాల్సిన బాధ్యత ఉభయ పక్షాలపై ఉందన్నారు. ప్రజల పన్నులతో నడిచే అసెంబ్లీ ప్రతి నిమిషం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు కాకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి సమయం కేటాయించాలని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అసెంబ్లీ చర్చలు సాగాలని వేంకటేశ్వరరావు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కాశబోయిన అయోధ్య, కుంచం భిక్షం, మాధవ్ తదితరులు పాల్గొన్నారు



# ఖమ్మం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఉచిత చిన్నపిల్లల గుండె చికిత్సా శిబిరం విజయవంతం

**బాధితులకు హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో ఉచితంగా గుండె ఆపరేషన్లు : డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు**

**ఖమ్మం, సెప్టెంబర్ 10, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు, ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎన్. వేణు మాధవరావు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా ప్రధాన ఆసుపత్రి లో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్కే) హైదరాబాద్ అపోలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సంయుక్త సహకారంతో నిర్వహించిన ఉచిత చిన్నపిల్లల గుండె చికిత్సా శిబిరం విజయవంతంగా ముగిసింది.ఈ శిబిరానికి 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల మొత్తం 62 మంది పిల్లలు హాజరయ్యారు. వీరిలో ఖమ్మం జిల్లాకు చెందినవారు 61 మంది కాగా, మహబూబాబాద్ జిల్లా నుండి ఒకరు హాజరయ్యారు. నిపుణులైన వైద్య బృందం చిన్నారులను క్షుణ్ణంగా పరీక్షించి వర్గీకరించారు



మేజర్ సర్జరీ అవసరమైన కేసులు: 03
మైనర్ సర్జరీ అవసరమైన కేసులు: 11
రీ–అసెస్మెంట్ కేసులు: 04
మెడికల్ మేనేజ్మెంట్ కేసులు: 05
పీరియాడికల్ రివ్యూ
(ప్రతి 6 నెలలకోసారి పరీక్షలు అవసరమైనవారు): 16
సాధారణ స్థితిలో ఉన్నవారు : 23

**ఉచితంగా గుండె ఆపరేషన్లు:**
ఈ క్యాంపులో గుండె ఆపరేషన్ అవసరమని గుర్తించిన చిన్నారుల తల్లిదండ్రులు తమ వెంట రేషన్ కార్డు, ఆధార్ కార్డు తాజా ఆదాయ ధృవీకరణ పత్రం తీసుకొని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో మెడికల్ కాలేజీ ఆసుపత్రిని సంప్రదిస్తే, అక్కడ వారికి పూర్తిగా ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించబడతాయని అధికారులు తెలిపారు.పాల్గొన్న వైద్యులు అండ్ సిబ్బంది:ఈ వైద్య శిబిరంలో హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సుజాతా పాటీల్, పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ , డాక్టర్ సునీల్ కుమార్ స్వైన్, పీడియాట్రిక్ కార్డియోసిక్ సర్జన్ , డాక్టర్ అనుపమ పాటేల్, సీనియర్ సర్జికల్ కార్డియాలజిస్ట్ చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే ఖమ్మం జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, పీడియాట్రిక్స్ హెచ్ఓడీ డాక్టర్ బాబు రత్నాకర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి లక్ష్మి నారాయణ, ఆర్ బి ఎస్ కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్లు ప్రకాష్, రవి, ప్రవీణ్ కుమార్, సతీష్, అరుణ, శిరీష, ఉదయలక్ష్మి , సుచిత్ర, అమూల్య, మాధవి, రవీంద్రనాథ్ తదితరులు పాలొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక చర్యలను అరికట్టాలి

**ఖమ్మం, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** బీఆర్ఎస్, బీజేపీ పార్టీల దళిత వ్యతిరేక చర్యలను అరికట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, అర్బన్ జిల్లా ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి అధ్యక్షతన పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్తరాఖండ్ లో ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే పాల్గొన్న ప్రదేశాన్ని బీజేపీ, మనువాద నాయకులు శుద్ధి చేసిన దాష్టీకం మరువక ముందే, అసెంబ్లీ ప్రారంభం రోజున బీఆర్ఎస్ పార్టీ శాసనమండలి సభ్యుడు తాతా మధు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం, అనంతరం ఎర్రవల్లిలో దళిత నాయకులు నిరసన తెలిపిన రోడ్లను బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం దారుణమన్నారు.ఈ దళిత వ్యతిరేక చర్యలను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి జెడ్పీ సెంటర్ లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుండి కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నూతి సత్యనారాయణ గౌడ్, నాగండ్ల దీపక్ చౌదరి పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, బొడ్డు బొందయ్య, మొక్క శేఖర్ గౌడ్, పుచ్చకాయల వీరభద్రం, విప్లవ కుమార్, తూములూరి లక్ష్మి నరసింహారావు, మూడుముంతల గంగరాజు యాదవ్, కొట్టే రాజశేఖర్, దామా స్వరూప తదితరులు పాల్గొన్నారు.



# మైనారిటీల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**- ఎంపీ రఘురామ రెడ్డికి రాజ్యాంగ పరిరక్షణ వేదిక వినతి**

**ఖమ్మం, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** రాజ్యాంగ పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు సాదిక్ అలీతో పాటు వేదిక సభ్యులు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామ్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు సంబంధించిన పలు సమస్యలతో పాటు మైనారిటీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా దేశంలో చోటుచేసుకుంటున్న ద్వేషపూరిత ప్రసంగాలపై పార్లమెంట్‌లో చర్చించి, వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తగిన చట్టాన్ని తీసుకు వచ్చే విధంగా కృషి చేయాలని సాదిక్ అలీ ఎంపీని కోరారు.ఖమ్మం జిల్లాలో మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, వివిధ సమస్యలకు పరిష్కారం చూపేందుకు తన జోక్యం చేసుకోవాలని కోరుతూ ఎంపీకి వినతిపత్రం సమర్పించారు.ప్రతినిధి బృందం ప్రస్తావించిన అంశాలపై ఎంపీ రఘురామ్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫోరం గౌరవ సలహాదారు అబ్దుల్ ఘనీ, పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి నజీరుద్దీన్, రూరల్ మండల ఇన్‌చార్జి జాఫర్, పెంటు సాహెబ్, చింతకాని, కూసుమంచి మండల అధ్యక్షుడు కొండపల్లి సుభాన్, ఖలీమ్, నిజాంపేట్ కార్యదర్శి మున్నాభాయ్, హబీబ్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ ఆరిఫ్, గులాం నబీ, టూ టౌన్ ఇన్‌చార్జి అల్లా భక్ష్ తదితరులు పాల్గొన్నారు.



# బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలి

**అఖిల భారత యువజన సమాఖ్య ఖమ్మం జిల్లా అధ్యక్షులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి**

**ఖమ్మం, సెప్టెంబర్ -10, నేటి శుభోదయ :** బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసి స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలని అఖిల భారత యువజన సమాఖ్య ఖమ్మం జిల్లా అధ్యక్షులు, 32 వ వార్డు సిపిఐ కౌన్సిలర్ మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలో జరుగుతున్న అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల్లో ఆయన ఈ మేరకు గురువారం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేస్తే ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని శ్రీనాథ్ రెడ్డి పేర్కొన్నారు. పరిశ్రమ ఏర్పాటులో స్థానిక గిరిజనుల హక్కులను పరిరక్షించడంతో పాటు పర్యావరణానికి ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక గిరిజనుల హక్కులను కాపాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయాలని మహాసభ సైతం డిమాండ్ చేసింది.



# క్విజ్ పోటీలలో అస్మా కౌసర్ కు ప్రధమ స్థానం



**ఖమ్మం, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** విఖసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీలో ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని అస్మా కౌసర్ ప్రథమ స్థానం లో నిలిచి కంప్యూటర్ లాప్టాప్ గెలుచుకుందని, గత సంవత్సరంలో నిర్వహించిన డ్రాయింగ్ పోటీలో మేఘన మొదటి స్థానం గెలుచుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ బానోత్ రెడ్డి మీడియా సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమం లో మేరా యువ భారత్ జిల్లా యూత్ అధికారి మద్దెల వెంకట రాంబాబు, మేరా యువ భారత్ అకౌంట్ అధికారి భాను చందర్, రాజనీతి శాస్త్రం అధ్యాపకురాలు అద్దేపల్లి చరిత్ర, పాత్రికేయులు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు.

# ఇందిరా ప్రియదర్శినికి కాళోజి నంది అవార్డు



**ఖమ్మం, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయవాద రంగానికి మరో విశిష్ట గౌరవం దక్కింది. జిల్లా కోర్టు పరిధిలో ప్రతిభ కనబరిచిన కొత్తగూడెం పట్టణం, ప్యూన్ బస్తీకి చెందిన అడ్వకేట్ ఇందిరా ప్రియదర్శిని "బెస్ట్ జూనియర్ అడ్వకేట్"గా ఎంపికయ్యారు. దీనితో పాటు కాళోజి జయంతి సందర్భంగా ప్రదానం చేసే ప్రతిష్టాత్మక "కాళోజి నంది అవార్డు"ను సైతం ఆమె దక్కించుకున్నారు. వరంగల్‌లోని కాళోజి ఆడిటోరియంలో బుధవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక సభలో హైకోర్టు న్యాయమూర్తి చేతుల మీదుగా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. న్యాయవృత్తిలో ఆమె చూపుతున్న నిబద్ధత, అంకితభావానికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం పట్ల జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య, పలువురు న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# డ్రిఫ్ ఇరిగేషన్ పంటల సాగు పై దృష్టి సారించాలి

**- ఉద్యానవన పాలేరు డివిజన్ అధికారిణి అపర్ణ**



**ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్10, నేటి శుభోదయ :** డ్రిప్ ఇరిగేషన్ పంటల సాగు పై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని ఉద్యానవన పాలేరు డివిజన్ అధికారిణి అపర్ణ సూచించారు. మండల కేంద్రంలో స్థానిక రైతు వేదిక లో గురువారం ఆత్మా ఆధ్వర్యంలో అవగాహణ, శిక్షణ ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉద్యానవన పంటల పై రైతులకు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో నీటి తక్కువ వినియోగం పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల సాగులో మెళుకువలు, చీడపీడల నివారణ చర్యలు, అధిక దిగుబడులు సాధించేందుకు సూచనలు పాటించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం వైపు ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత. పరిస్థితులలో పప్పు దినుసులు సాగు చేయాలని అన్నారు. ఉద్యానవన శాఖలో అందుబాటులో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్పామ్, కూరగాయాల సాగు విస్తృతంగా చేపట్టాలని అన్నారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. పలు అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈవో లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.